@vaartanews @mvnewstv
www.mivaartanews.com
TGBIL/25/A0512
మీ వార్త
AP EDITION
ప్రతి అక్షరం... ప్రజల కోసం
విజయవాడ
ఆదివారం 8 నవంబర్ 2026
సంపుటి : 2
సంచిక : 260
పేజీలు : 8 వెల : 5/-



తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు,
నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు,
మండలాల వారీగా విలేకరులు కావలెను.

సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



తుపాను బాధితులకు
తక్షణ ఊరట

- మురసు తుపాను నష్టంపై సీఎం సమీక్ష
- రేపటిలోగా నిత్యావసరాల పంపిణీ పూర్తి చేయాలి!
- ఈ నెల 9లోగా పంట నష్టం అంచనాలు పూర్తి చేయాలి..
- 92 శాతం ఉద్యాన పంటల నష్టం అంచనాలు పూర్తి..
- 3.82 లక్షల కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ



అమరావతి

మురసు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు, విద్యుత్ పునరుద్ధరణ, పంట నష్టం అంచనాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. శనివారం క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్, రెవెన్యూ, విద్యుత్, వ్యవసాయం, పౌరసరఫరాల శాఖల ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. తుపాను బాధితులకు నిత్యావసర సరకుల పంపిణీని ఆదివారం నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పంట నష్టం అంచనాలను త్వరితగతిన పూర్తి చేసి, బాధిత రైతులకు తక్షణ సాయం అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. మురసు తుపాను కారణంగా దెబ్బతిన్న ఉద్యాన పంటలకు సంబంధించి ఇప్పటివరకు 92 శాతం నష్టం అంచనాలు పూర్తయ్యాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వ్యవసాయ పంటల నష్టం అంచనాలను ఈ నెల 9వ తేదీలోగా పూర్తి చేస్తామని తెలిపారు. నష్టం వివరాల నమోదు, - మిగతా3లో



దక్షిణాదికి బుల్లెట్
రైలు కానుక

- బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు 2 గంటల 10 నిమిషాలే!
- బెంగళూరు--చెన్నై మధ్య 73 నిమిషాలే
- ఏడు హైస్పీడ్ కారిడార్లకు కేంద్రం ప్రతిపాదన
- హైదరాబాద్--చెన్నై మధ్య 2 గంటల 55 నిమిషాలు
- రూ.16 లక్షల కోట్ల పెట్టుబడుల అంచనా
- 4 వేల కిలోమీటర్ల మేర హైస్పీడ్ నెట్‌వర్క్
- ఐటీ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు భారీ ప్రయోజనం



ప్రజాస్వామ్యానికి బీజేపీ తీవ్ర నష్టం చేసింది..

- వ్యవస్థల పునరుద్ధరణకు సమష్టి కృషి అవసరం: సోనియా గాంధీ
- మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత విమర్శలు..
- ఎన్నికల్లో అక్రమాలు జరిగాయంటూ ఆరోపణలు..
- ఆత్మకథలో రాజీవ్‌తో అనుబంధం, రాజకీయ ప్రయాణం

ఎమర్జెన్సీపై కీలక వ్యాఖ్యలు..

గాంధీ, నెహ్రూల స్థాయి మోదీకి ఎప్పటికీ రాదు!

- ప్రధాని మోదీపై అభిజీత్ దీప్కే తీవ్ర విమర్శలు..
- 120 ఏళ్లు అధికారంలో ఉన్నా ఆ మహానేతలతో పోలిక సాధ్యం కాదు..
- ఎస్ఐఆర్‌పై పోరాటం ఆగదని స్పష్టీకరణ



మేం ఓడినా..
ప్రజల మనసులు
గెలుచుకున్నాం

చంద్రబాబు గెలిచి నైతికంగా ఓడిపోయారు..

ఎన్నికల్లో అధికార దుర్వినియోగం జరిగిందని ఆరోపణ..

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తాం



తాడేపల్లి

స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కూటమి అక్రమాలకు పాల్పడిందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. నామినేషన్ల దశ నుంచి పోలింగ్, ఓట్ల లెక్కింపు వరకు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని విమర్శించారు. చంద్రబాబు ఎన్నికల్లో గెలిచినా నైతికంగా ఓడిపోయారని, తాము ఓటమి పాలైనా ప్రజల మనసులను గెలుచుకున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ ఆయన సోషల్ మీడియాలో పోస్టు చేశారు. మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ తరహాలోనే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపులోనూ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారని జగన్ ఆరోపించారు. పలు జిల్లాల్లో ఫలితాలను అడ్డగోలుగా తారుమారు చేస్తున్నారని విమర్శించారు. నామినేషన్ల నుంచి పోలింగ్ వరకు చోటుచేసుకున్న పరిణామాలు - మిగతా3లో



చైనా క్షిపణులకు చెక్ పెట్టేందుకు అమెరికా మాస్టర్‌ప్లాన్

- రెండో ప్రపంచ యుద్ధం నాటి ఎయిర్‌బేస్‌లకు మళ్లీ కళ!
- పసిఫిక్‌లో నాలుగు ఎయిర్‌ఫీల్డ్‌ల విస్తరణకు అమెరికా ప్రతిపాదన
- రెండో ప్రపంచ యుద్ధం నాటి టినియన్ ఎయిర్‌బేస్ కూడా జాబితాలో
- ఏడాదికి 6,080 విమాన కార్యకలాపాలు నిర్వహించే అవకాశం
- ఒక్కో ప్రాంతంలో వెయ్యి మంది సైనికులతో విన్యాసాలు
- చైనా క్షిపణి దాడుల ముప్పును ఎదుర్కొనేందుకు ఏసీఈ వ్యూహం

ఏపీ పరిషత్ పోరులో కూటమి
క్లీన్‌స్వీప్!

- ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ కూటమి ఘన విజయం
- జడ్పీటీసీల్లో 273.. ఎంపీటీసీల్లో 5,597 స్థానాలు కైవసం
- వైసీపీకి గట్టి ఎదురుదెబ్బ.. టీడీపీదే పైచేయి



అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అధికార తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించింది. గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ కలిసి అత్యధిక స్థానాలను కైవసం చేసుకోగా.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెనుకబడింది. శనివారం ఉదయం 8 గంటలకు రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన ఓట్ల లెక్కింపు రాత్రి వరకు కొనసాగింది. రాత్రి 9 గంటల సమయానికి రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించిన గణాంకాల ప్రకారం కూటమి పార్టీలు కలిపి 273 జడ్పీటీసీ, - మిగతా3లో

చమురు శుద్ధిలో
భారత్ దూకుడు

- అమెరికా, యూరప్‌పై వ్యూహాత్మక ఆధిక్యం
- చమురు శుద్ధి సామర్థ్యంలో భారత్‌కు ప్రపంచంలో నాలుగో స్థానం
- ఏడాదికి 267.1 మిలియన్ టన్నుల ప్రస్తుత సామర్థ్యం
- 2030 నాటికి 300 మిలియన్ టన్నుల లక్ష్యం
- ముడి చమురు అవసరాల్లో 88 శాతం దిగుమతులపైనే ఆధారం
- ఆరు నెలల్లో పెట్రోలియం ఎగుమతుల విలువ 27.2 బిలియన్ డాలర్లు



ప్రజాస్వామ్యానికి బీజేపీ తీవ్ర నష్టం చేసింది

న్యూఢిల్లీ : దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలు, రాజ్యాంగ సంస్థలు, దేశ మౌలిక స్వరూపం గత 12 ఏళ్లలో తీవ్రంగా దెబ్బతిన్నాయని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ ఆరోపించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరిచిందని విమర్శించారు. ప్రజలు ఈ పరిణామాలను క్రమంగా గుర్తిస్తున్నారని, భవిష్యత్తులో ప్రజాస్వామ్యాన్ని, సుపరిపాలనను పునరుద్ధరించేందుకు రాజకీయ పార్టీలు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తన తాజా ఇంటర్వ్యూలో బీజేపీ ప్రభుత్వ పాలన, కాంగ్రెస్ రాజకీయ భవిష్యత్తు, 1975 ఎమర్జెన్సీ, తన వ్యక్తిగత జీవితం, త్వరలో విడుదల కానున్న ఆత్మకథకు సంబంధించిన పలు అంశాలపై ఆమె స్పందించారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలకు తీవ్ర నష్టం

గత పన్నెండేళ్లలో దేశ ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ సంస్థలకు జరిగిన నష్టం అంతా ఇంతా కాదని సోనియా గాంధీ వ్యాఖ్యానించారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలో నుంచి వెళ్లిపోయిన తర్వాత కూడా వ్యవస్థలను తిరిగి గాడిలో పెట్టడం అంత సులభం కాదన్నారు. ఇందుకు సమయం, రాజకీయ పార్టీల నుంచి గట్టి ప్రయత్నం అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రజల్లో అసహనం పెరుగుతోందని, దేశంలో జరుగుతున్న పరిణామాలను వారు అర్థం చేసుకుంటున్నారని చెప్పారు. అయినప్పటికీ దేశ భవిష్యత్తుపై తనకు ఆశావాదం ఉందని, ప్రజలు తిరిగి మెరుగైన పాలనను స్వాగతిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

ప్రతిపక్షాలకు సమాన అవకాశాలు లేవు

కాంగ్రెస్ పార్టీ ప్రస్తుత పరిస్థితి, భవిష్యత్తుపై స్పందిస్తూ తాను నిరాశావాదంతో లేనని సోనియా తెలిపారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్‌తో పాటు ఇతర ప్రతిపక్ష పార్టీలకు సమాన అవకాశాలు లభించడం లేదని ఆరోపించారు. ఎన్నికల సంఘం సహా కీలక వ్యవస్థలపై అధికార పార్టీ ప్రభావం ఉందని, ప్రధాన స్రవంతి మీడియా, ఆర్థిక బలం, మతాన్ని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం వంటి అంశాలు ఎన్నికల పోటీలో అసమానతలకు కారణమవుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు,



కార్యకర్తలు అనేక రకాల వేధింపులు ఎదుర్కొంటున్నప్పటికీ గ్రామస్థాయి నుంచి పార్టీ శ్రేణులు రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం పోరాడుతున్నాయని చెప్పారు. ఇటీవలి కాలంలో పలు ఎన్నికల్లో అక్రమాలు, ఓట్ల చోరీ జరిగాయనే అంశాలు వెలుగులోకి వచ్చాయని ఆరోపిస్తూ, ప్రజలు కూడా వీటిని గుర్తిస్తున్నారని పేర్కొన్నారు. భావసారూప్యత కలిగిన పార్టీలతో కలిసి కాంగ్రెస్ ముందుకు సాగుతోందని, పార్టీ విజయావకాశాలు రోజురోజుకూ మెరుగుపడుతున్నాయని ధీమా వ్యక్తం చేశారు.

ఎమర్జెన్సీపై ఇందిర నిర్ణయాన్ని సమర్థించిన సోనియా

1975లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీపై కూడా సోనియా కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ సమయంలో ప్రజాస్వామ్య హక్కులు పరిమితమైనప్పటికీ, ఇందిరా గాంధీ అనంతరం పరిస్థితులను సమీక్షించి ప్రజాస్వామ్య ప్రక్రియకు తిరిగి వచ్చారని గుర్తుచేశారు. ఎమర్జెన్సీ సమయంలో హేబియస్ కార్పస్ హక్కును కూడా నిలిపివేశారని అంగీకరించారు. అయితే అప్పటి పరిస్థితుల్లో హింసాత్మక నిరసనలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా రవాణా వ్యవస్థలపై దాడులు, అశాంతి వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయని వివరించారు. 1977 మార్చిలో ఎన్నికలు నిర్వహించేందుకు ఇందిర నిర్ణయం తీసుకున్నారని, ఎమర్జెన్సీ కాలంలో జరిగిన అకృత్యాలపై ఆ తర్వాత బహిరంగంగా విచారం వ్యక్తం చేసి క్షమాపణలు చెప్పారని సోనియా వెల్లడించారు.

నవంబర్ 10న ఆత్మకథ విడుదల

తన జీవితంలోని అనేక ఆసక్తికర విషయాలను 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' అనే ఆత్మకథలో పొందుపరిచినట్లు సోనియా తెలిపారు. నవంబర్ 10న ఈ పుస్తకం విడుదల కానుంది. యుద్ధానంతర ఇటలీలో తన బాల్యం, రాజీవ్ గాంధీతో పరిచయం, ప్రేమ, వివాహం, గాంధీ కుటుంబంతో ఏర్పడిన అనుబంధం, భారతీయ సంస్కృతిని అలవర్చుకున్న తీరు వంటి అంశాలను ఇందులో వివరించారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీతో తన అనుబంధం, ఆయన కుటుంబం పట్ల ప్రేమ, భారతదేశంతో తనకు ఏర్పడిన అనుబంధం ఈ పుస్తకంలో ప్రధానంగా ఉంటాయని చెప్పారు.

కుటుంబ త్యాగాలే రాజకీయాల్లోకి వచ్చేలా చేశాయి

గాంధీ కుటుంబం చేసిన త్యాగాలు, ఆ త్యాగాల వెనుక ఉన్న లక్ష్యాలకు ఎదురవుతున్న ముప్పు, కాంగ్రెస్ పార్టీ బలహీనపడుతున్న పరిస్థితులు తనను ప్రజా జీవితంలోకి అడుగుపెట్టేలా చేశాయని సోనియా వెల్లడించారు. ఇంతకాలం తన వ్యక్తిగత జీవిత విశేషాలను బహిరంగంగా పంచుకోవడానికి ఆసక్తి చూపలేదని, ఇప్పుడు తన జీవిత ప్రయాణాన్ని పుస్తక రూపంలో ప్రజల ముందుకు తీసుకురావాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. 2004లో యూపీఏ అధికారంలోకి వచ్చినప్పుడు ప్రధాని పదవిని స్వీకరించకపోవడంపై కూడా స్పందించారు. అప్పటి ప్రభుత్వంలో మన్మోహన్ సింగ్ ప్రధానిగా, తాను పార్టీ నాయకురాలిగా వేర్వేరు బాధ్యతలు నిర్వహించామని, ఆ అనుభవం సానుకూలంగా ఉందని పేర్కొన్నారు.

సోనియా వ్యాఖ్యలపై బీజేపీ ఎదురుదాడి

సోనియా గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ నేతలు కూడా స్పందించారు. ఎమర్జెన్సీ కాలంలో ప్రజాస్వామ్య హక్కులను అణచివేసిన విషయాన్ని ఆమె గుర్తుచేసుకోవాలని కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ హితవు పలికారు. అప్పట్లో వేలాది మంది ప్రతిపక్ష నాయకులను జైళ్లలో పెట్టారని, జర్నలిస్టుల గొంతుకలను నొక్కేశారని విమర్శించారు. దీంతో ప్రజాస్వామ్య పరిరక్షణ అంశంపై కాంగ్రెస్, బీజేపీ మధ్య రాజకీయ విమర్శలు మరోసారి వేడెక్కాయి.

గాంధీ, నెహ్రూల స్థాయి మోదీకి ఎప్పటికీ రాదు!

కొచ్చి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ ప్రభుత్వంపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూలతో పోలిస్తే మోదీ స్థాయి ఎప్పటికీ సరిపోదని వ్యాఖ్యానించారు. మోదీ మరో 120 ఏళ్లు అధికారంలో కొనసాగినా ఆ మహానేతలు దేశానికి చేసిన సేవలకు సమానమైన సేవలు చేయలేరని విమర్శించారు. స్వాతంత్ర్య పోరాటంలో మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న భావజాల సంస్థ పాత్రపై కూడా అభ్యంతరాలు వ్యక్తం చేశారు.



శనివారం కేరళలోని కొచ్చిలో నిర్వహించిన 'జంతర్ మంతర్ ఎట్ కొచ్చి' నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

గాంధీ దేశ ఆత్మ.. అంబేద్కర్ వెన్నెముక

మహాత్మా గాంధీని భారతదేశ ఆత్మగా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను దేశ వెన్నెముకగా, జవహర్‌లాల్ నెహ్రూను దేశ మేధస్సుగా అభిజీత్ దీప్కే అభివర్ణించారు. ఈ ముగ్గురు మహానేతలు దేశ నిర్మాణానికి చేసిన కృషి అపారమని పేర్కొన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న భావజాల సంస్థ ఎలాంటి పాత్ర పోషించలేదని, వలస పాలకులకు సేవ చేయడానికే పరిమితమైందని ఆరోపించారు. దేశ స్వాతంత్ర్యం కోసం మహానేతలు పోరాడుతుంటే, అప్పటి ఆ సంస్థ బ్రిటిష్ పాలకులకు అనుకూలంగా వ్యవహరించిందని విమర్శించారు.

ఓటు హక్కును హరిస్తున్నారా?

ప్రజల ఓటు హక్కును నియంత్రించేందుకు ప్రధాని మోదీ, బీజేపీ ప్రయత్నిస్తున్నారని దీప్కే ఆరోపించారు. ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేందుకు ఉపయోగిస్తున్నారని విమర్శించారు. ఈ ప్రక్రియ పేరుతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఓటర్ల పేర్లు తొలగించారని ఆరోపించారు. స్వతంత్ర, నిష్పక్షపాత ఎన్నికల వ్యవస్థ ఏర్పడే వరకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

త్రివర్ణ పతాకం ఎగురవేస్తూనే ఉంటా

త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసినందుకు తనను, తన ఇద్దరు సోదరులను జైలులో పెట్టారని అభిజీత్ దీప్కే వెల్లడించారు. దేశంలోని ప్రతి ప్రాంతంలోనూ జాతీయ జెండాను ఎగురవేస్తానని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా వెనక్కి తగ్గేది లేదని ప్రకటించారు. తనను ఢిల్లీ, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు సహా దేశంలోని ఏ ప్రాంతంలోనైనా అరెస్టు చేసుకోవచ్చని సవాల్ విసిరారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా మళ్లీ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తానని స్పష్టం చేశారు.

ప్రకాశ్ రాజ్ ఆహ్వానంతో కొచ్చికి

కేరళలోని కొచ్చిలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి స్థానిక నిర్వాహకులతో పాటు ప్రముఖ నటుడు, సామాజిక కార్యకర్త ప్రకాశ్ రాజ్ తనను ఆహ్వానించారని దీప్కే తెలిపారు. వారి ఆహ్వానం మేరకే తాను కొచ్చికి వచ్చినట్లు చెప్పారు. దేశంలో ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగే వరకు ఎస్ఐఆర్‌పై తమ ఉద్యమం కొనసాగుతుందని పునరుద్ఘాటించారు. ప్రజాస్వామ్య పరిరక్షణే తమ ఉద్యమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

చమురు శుద్ధిలో భారత్ దూకుడు..

ముడి చమురు అవసరాల్లో దాదాపు 88 శాతం దిగుమతులపైనే ఆధారపడుతున్న భారత్.. శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతుల్లో మాత్రం ప్రపంచంలో కీలక శక్తిగా ఎదుగుతోంది. అమెరికా, ఐరోపా దేశాలు చమురు శుద్ధి సామర్థ్యాన్ని తగ్గించుకుంటుంటే.. భారత్ మాత్రం దాన్ని విస్తరిస్తోంది. దీంతో అంతర్జాతీయ చమురు మార్కెట్‌లో దేశానికి వ్యూహాత్మక ఆధిక్యం లభిస్తోందని 'ఇండియా నెరేటివ్' కథనం విశ్లేషించింది. 2026 ఏప్రిల్ నాటికి భారత్ చమురు శుద్ధి సామర్థ్యం ఏడాదికి 267.1 మిలియన్ టన్నులుగా ఉంది. రోజుకు సుమారు 53 నుంచి 56 లక్షల బ్యారెళ్లకు సమానమైన ఈ సామర్థ్యంతో ప్రపంచంలో నాలుగో స్థానంలో నిలిచింది. అమెరికా, చైనా, రష్యా తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. 2030 నాటికి శుద్ధి సామర్థ్యాన్ని 300 మిలియన్ టన్నులకు పెంచాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. దీర్ఘకాలంలో 400 మిలియన్ టన్నులకు చేర్చాలని భావిస్తోంది. భారత్ రోజుకు 54 నుంచి 56 లక్షల బ్యారెళ్ల ముడి చమురును దిగుమతి చేసుకుంటోంది. ఇందులో రష్యా వాటా ఇటీవల 18 నుంచి 20 లక్షల బ్యారెళ్లుగా ఉంది. మొత్తం దిగుమతుల్లో ఇది దాదాపు 35 శాతం. గతంలో ఈ వాటా 50 శాతాన్ని దాటిన సందర్భాలున్నాయి. ధరల ఆధారంగా భారత్ కొనుగోళ్ల నిర్ణయాలు తీసుకుంటోందని కథనం పేర్కొంది. మరోవైపు శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతుల ద్వారా భారత్‌కు భారీ ఆదాయం వస్తోంది. 2026 సెప్టెంబర్‌తో ముగిసిన ఆరు నెలల్లో ఈ ఎగుమతుల విలువ 27.2 బిలియన్ డాలర్లకు చేరింది. ఇందులో డీజిల్ వాటా 12.6 బిలియన్ డాలర్లు. సెప్టెంబర్‌లో రోజుకు సుమారు 6.2 లక్షల బ్యారెళ్ల డీజిల్‌ను భారత్ ఎగుమతి చేసింది. ఇందులో దాదాపు సగం ఐరోపా దేశాలకే వెళ్లింది. రష్యా ఉత్పత్తులపై పరిమితులు, ఐరోపాలో రిఫైనరీల మూసివేత, మధ్యప్రాచ్యంలో నిర్వహణ పనుల కారణంగా ఏర్పడిన కొరతను భారత ఎగుమతులు కొంతవరకు భర్తీ చేస్తున్నాయి. రష్యా చమురు కొనుగోళ్ల విషయంలో భారత్‌పై అమెరికా ఆంక్షలు, సుంకాల ఒత్తిడి తెస్తున్నా.. భారత రిఫైనరీల్లో శుద్ధి చేసిన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌లో ఇంధన సరఫరాకు ఉపయోగపడుతున్నాయని కథనం విశ్లేషించింది. ఇంధన ధరలు పెరిగినప్పుడు అమెరికా కూడా కొన్ని ఆంక్షల విషయంలో మినహాయింపులు ఇచ్చిందని గుర్తుచేసింది. భారత్ రిఫైనింగ్ సామర్థ్యం పెరిగితే ప్రపంచ మార్కెట్‌లో సరఫరా సమతుల్యతను ప్రభావితం చేసే స్థాయిలో దేశం నిలుస్తుందని పేర్కొంది.



ఈ20 పేరుతో ప్రజలకు 420 మోసం చేస్తున్నారా?

న్యూఢిల్లీ : దేశంలో ఈ20 పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమం అంశం రాజకీయ దుమారం రేపుతోంది. పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపాల్సి ఉండగా, అంతకుమించి మిశ్రమం చేస్తున్న చమురు కంపెనీలపై కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. కర్ణాటకలో నిర్వహించిన పరీక్షల్లో పలు పెట్రోల్ నమూనాల్లో నిర్దేశిత పరిమితికి మించి ఇథనాల్ ఉన్నట్లు వెల్లడైందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై శనివారం ఎక్స్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. మరోవైపు, రాహుల్ ఆరోపణలను ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ఖండించడంతో ఈ వివాదం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

ఈ20 కాస్త 420గా మారింది!

పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలుపుతున్నామని కేంద్రం చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి మరోలా ఉందని రాహుల్ గాంధీ ఆరోపించారు. కర్ణాటక ప్రభుత్వం ఏడు జిల్లాల నుంచి సేకరించిన 14 పెట్రోల్ నమూనాలను గుర్తింపు పొందిన ప్రయోగశాలల్లో పరీక్షించగా, 11 నమూనాల్లో ఇథనాల్ శాతం 20 శాతానికి మించి ఉన్నట్లు పేర్కొన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్) నమూనాలో 31.2 శాతం, హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీసీఎల్) నమూనాలో 30.5 శాతం ఇథనాల్ ఉన్నట్లు పరీక్షల్లో తేలిందని వెల్లడించారు. భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), నయారా, షెల్ సంస్థలపైనా ఆరోపణలు చేశారు. ఈ20 పేరుతో విక్రయిస్తున్న ఇంధనం 420గా మారిందంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అధిక శాతం ఇథనాల్ కలిగిన పెట్రోల్ వల్ల వాహనదారులు నష్టపోతున్నారని రాహుల్ విమర్శించారు. ఇథనాల్ మిశ్రమాన్ని తట్టుకునే సామర్థ్యం లేని వాహనాల్లో ఈ ఇంధనాన్ని వినియోగిస్తే ఇంజిన్ పనితీరుపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. మైలేజీ తగ్గడంతో పాటు వాహనాల నిర్వహణ, మరమ్మతుల ఖర్చులు పెరుగుతాయని ఆరోపించారు.

చైనా క్షిపణులకు చెక్ పెట్టేందుకు అమెరికా మాస్టర్‌ప్లాన్

చైనా క్షిపణి సామర్థ్యం పెరుగుతుండటంతో అమెరికా తన సైనిక వ్యూహాన్ని మార్చుకుంటోంది. పశ్చిమ పసిఫిక్ ప్రాంతంలో వైమానిక కార్యకలాపాలను విస్తరించేందుకు రెండో ప్రపంచ యుద్ధం సమయంలో కీలకంగా పనిచేసిన విమానాశ్రయాలను మళ్లీ వినియోగంలోకి తీసుకురావాలని యోచిస్తోంది. ఇందులో జపాన్‌పై అణుబాంబు దాడులకు అమెరికా బాంబర్ విమానాలు ఉపయోగించిన టినియన్ దీవిలోని చారిత్రక ఎయిర్‌బేస్ కూడా ఉంది. కామన్‌వెల్త్ ఆఫ్ నార్తర్న్ మరియానా దీవుల పరిధిలోని నాలుగు ఎయిర్‌ఫీల్డ్‌లలో సైనిక శిక్షణ, విమానాల రాకపోకలు, సరకు రవాణా కార్యకలాపాలను పెంచాలని అమెరికా వైమానిక దళం ప్రతిపాదించింది. అక్టోబర్ 28న అమెరికా వైమానిక దళ విభాగం విడుదల చేసిన నోటీసులో ఈ ప్రణాళిక వివరాలను వెల్లడించింది. ఈ నాలుగు ప్రాంతాల్లో ఏడాదికి మొత్తం 6,080 విమాన కార్యకలాపాలు నిర్వహించే అవకాశం ఉంది. ప్రతిపాదన ప్రకారం.. ఒక్కో ఎయిర్‌ఫీల్డ్‌లో ఏడాదికి 1,200 స్థిర రెక్కల విమానాల కార్యకలాపాలు, 320 హెలికాప్టర్ కార్యకలాపాలు చేపట్టవచ్చు. మరో ప్రత్యామ్నాయ ప్రణాళికలో ఈ సంఖ్యను వరుసగా 1,400, 384కు పెంచే అవకాశాన్ని పరిశీలిస్తున్నారు. ఈ విన్యాసాల్లో గరిష్ఠంగా వెయ్యి మంది సైనికులు పాల్గొనవచ్చు. ఒక్కో ప్రాంతంలో 5.5 లక్షల గ్యాలన్ల వరకు ఇంధనం అవసరమవుతుందని అంచనా. తాత్కాలిక సైనిక వసతులు, విమానాల మరమ్మతులు, రవాణా ఏర్పాట్లతో పాటు రక్షణ చర్యల్లో భాగంగా చాఫ్, ఫ్లేర్స్ వినియోగం కూడా ఈ కార్యకలాపాల్లో భాగం కానుంది.

చైనా క్షిపణి ముప్పే ప్రధాన కారణం

చైనా సైనిక సామర్థ్యం, ముఖ్యంగా దాని క్షిపణి వ్యవస్థల



విస్తరణ నేపథ్యంలో అమెరికా ఈ చర్యలకు సిద్ధమవుతోంది. ఒకే సైనిక స్థావరంపై ఆధారపడకుండా విమానాలు, సిబ్బంది, పరికరాలను పలు ప్రాంతాలకు విస్తరించడమే అమెరికా వైమానిక దళం అనుసరిస్తున్న 'ఏజైల్ కాంబాట్ ఎంప్లాయ్‌మెంట్' (ఏసీఈ) వ్యూహం ముఖ్య ఉద్దేశం. శత్రుదేశం ఒక ప్రధాన స్థావరంపై దాడి చేసినా మిగిలిన ప్రాంతాల నుంచి కార్యకలాపాలు కొనసాగించేలా ఈ విధానం ఉపయోగపడుతుంది. తైవాన్ చుట్టూ యుద్ధ పరిస్థితులు తలెత్తితే పశ్చిమ పసిఫిక్‌లోని అమెరికా సైనిక స్థావరాలు చైనా క్షిపణులకు లక్ష్యంగా మారే ప్రమాదం ఉందని వాషింగ్టన్ ఆందోళన చెందుతోంది. గువామ్‌లోని ఆండర్సన్ వైమానిక స్థావరం అమెరికా కార్యకలాపాలకు కీలకం. అక్కడి రన్‌వేలు, ఇంధన నిల్వలు, రవాణా వ్యవస్థలకు నష్టం వాటిల్లితే యుద్ధ సమయంలో విమానాల మోహరింపు కష్టమవుతుంది. గువామ్‌కు ఉత్తరాన 100 నాటికల్ మైళ్లలోపే ఉన్న నార్తర్న్ మరియానా దీవులు ఈ సమస్యకు ప్రత్యామ్నాయంగా మారవచ్చని అమెరికా భావిస్తోంది. వాణిజ్య విమానాశ్రయాల నుంచి తాత్కాలిక ఏర్పాట్లతో పనిచేసే ప్రాంతాల వరకు భిన్నమైన వాతావరణాల్లో సైనిక కార్యకలాపాలను పరీక్షించేందుకు ఈ నాలుగు ఎయిర్‌ఫీల్డ్‌లు ఉపయోగపడనున్నాయి. ఈ ప్రణాళిక ద్వారా ఇండో-పసిఫిక్ ప్రాంతంలో తన వైమానిక బలగాల మోహరింపును మరింత విస్తరించాలని అమెరికా లక్ష్యంగా పెట్టుకుంది.

ఆకాశమే హద్దుగా.. 13,629 అడుగుల ఎత్తులో భారత వాయుసేన ప్రపంచ రికార్డు

లడఖ్‌లో భారత వాయుసేన చారిత్రక ఘనత

13,629 అడుగుల ఎత్తులో ఐఎల్-76ఎండీ ల్యాండింగ్

న్యోమా ఎయిర్‌ఫీల్డ్‌లో విజయవంతంగా దిగిన విమానం

ఈ తరహా విమానానికి ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ల్యాండింగ్

ఎల్ఏసీకి సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఎయిర్‌ఫీల్డ్

తక్కువ గాలి సాంద్రతలో ల్యాండింగ్ చేయడం సవాలు

లడఖ్‌లో భారత వాయుసేన అరుదైన ఘనత సాధించింది. అత్యంత ఎత్తైన ప్రాంతాల్లో భారీ విమానాలను నడిపే సామర్థ్యాన్ని చాటుతూ.. ఐఎల్-76ఎండీ రవాణా విమానాన్ని 13,629 అడుగుల ఎత్తులో విజయవంతంగా ల్యాండ్ చేసింది. తూర్పు లడఖ్‌లోని న్యోమా ఎయిర్‌ఫీల్డ్‌లో ఈ చారిత్రక ల్యాండింగ్ జరిగింది. ప్రపంచంలో ఈ తరహా విమానానికి ఇదే అత్యంత ఎత్తులో జరిగిన ల్యాండింగ్ అని భారత వాయుసేన ప్రకటించింది.

ఈ ఘనతకు సంబంధించిన ఫొటోలు, వీడియోను వాయుసేన సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. విమానం సామర్థ్యంతోపాటు సిబ్బంది నైపుణ్యం, కచ్చితత్వం, వృత్తి నైపుణ్యానికి ఈ విజయం నిదర్శనమని పేర్కొంది. దేశ వ్యూహాత్మక రవాణా సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే కీలక ముందడుగుగా అభివర్ణించింది. చైనా సరిహద్దులోని వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ)కి సమీపంలో న్యోమా ఎయిర్‌ఫీల్డ్ ఉంది. సరిహద్దుకు సుమారు 25 కిలోమీటర్ల దూరంలో



ఉండటంతో సైనికపరంగా దీనికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ఇక్కడి ఎత్తైన ప్రాంతాల్లో గాలి సాంద్రత తక్కువగా ఉంటుంది. దీంతో విమానాలకు ఇంజిన్ పనితీరు, గాల్లోకి లేచే సామర్థ్యం తగ్గుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో భారీ రవాణా విమానాన్ని సురక్షితంగా దించడం సవాలుతో కూడుకున్న పని. రష్యా మూలాలున్న ఐఎల్-76ఎండీ నాలుగు ఇంజిన్ల భారీ రవాణా విమానం. సైనికులు, ఆయుధ సామగ్రి, ఇతర భారీ సరకులను మారుమూల ప్రాంతాలకు తరలించేందుకు వాయుసేన దీన్ని వినియోగిస్తోంది. న్యోమాలో ఈ విమానం ల్యాండింగ్ కావడం సరిహద్దు ప్రాంతాల్లో సైనిక అవసరాలకు వేగంగా స్పందించే భారత సామర్థ్యాన్ని చాటిందని రక్షణ రంగ వర్గాలు పేర్కొంటున్నాయి.

తుపాను బాధితులకు తక్షణ ఊరట

-మొదటిపేజీ తరువాయి

క్షేత్రస్థాయి పరిశీలనలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని సీఎం ఆదేశించారు.

1,825 గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనులు

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులపై చంద్రబాబు ఆరా తీశారు. మురసు తుపాను ప్రభావంతో 1,825 గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు 7,850 దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను మరమ్మతు చేసినట్లు వివరించారు. గతంలో వచ్చిన అర్నబ్ తుపాను కారణంగా సుమారు 30 వేల విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని, ప్రస్తుతం అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు వెల్లడించారు.

3.82 లక్షల కుటుంబాలకు నిత్యావసర సరకులు

తుపాను బాధిత కుటుంబాలకు నిత్యావసర సరకుల పంపిణీ కొనసాగుతోందని పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. ఇప్పటివరకు 3.82 లక్షల కుటుంబాలకు సరకులు అందించినట్లు వెల్లడించారు. మిగిలిన కుటుంబాలకు ఆదివారం నాటికి పంపిణీ పూర్తి చేస్తామని ముఖ్యమంత్రికి హామీ ఇచ్చారు. పంపిణీ ప్రక్రియను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని చంద్రబాబు ఆదేశించారు.

రైతుబజార్లలో కిలో ఉల్లిపాయలు రూ.35

బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించేందుకు తీసుకుంటున్న చర్యలపై సీఎం సమీక్షించారు. ఉల్లిపాయలు, బియ్యం, పామాయిల్,



కందిపప్పు, గోధుమ పిండి ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. రైతుబజార్ల ద్వారా కిలో ఉల్లిపాయలను రూ.35కే విక్రయిస్తున్నామని అధికారులు తెలిపారు. ఇందుకోసం 8 వేల క్వింటాళ్ల ఉల్లిపాయలను మార్కెట్‌లోకి తీసుకొచ్చినట్లు వివరించారు.

బియ్యం ధరల నియంత్రణకు చర్యలు

బియ్యం ధరలను నియంత్రించేందుకు మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులతో చర్చలు జరిపినట్లు అధికారులు వెల్లడించారు. వివిధ రకాల బియ్యాన్ని నిర్ణీత ధరలకు విక్రయించేందుకు వ్యాపారులు అంగీకరించినట్లు తెలిపారు. బీపీటీ సోనా, సాంబ, కేఎన్ఎం రకాల బియ్యాన్ని కిలో రూ.66కు, హెచ్ఎంటీ, ఆర్ఎన్ఆర్ రకాలను రూ.76కు, జై శ్రీరామ్ రకాన్ని రూ.82కు, సాధారణ రకం బియ్యాన్ని రూ.47కు విక్రయించేందుకు అంగీకరించినట్లు వివరించారు. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించిన 204 మంది వ్యాపారులపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

రైతుబజార్లలో ధరణి బియ్యం కిలో రూ.50

ధరణి బ్రాండ్ బియ్యాన్ని రైతుబజార్లలో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు అధికారులు తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.70 పలుకుతున్న బియ్యాన్ని రైతుబజార్లలో రూ.50కే విక్రయిస్తున్నామని చెప్పారు. బీపీటీ రకం బియ్యాన్ని కిలో రూ.49కు అందిస్తున్నట్లు వివరించారు. ఇప్పటివరకు 150 కౌంటర్ల ద్వారా 27,430 క్వింటాళ్ల బియ్యాన్ని విక్రయించగా, 1.03 లక్షల కుటుంబాలు కొనుగోలు చేసినట్లు వెల్లడించారు.

రేషన్ దుకాణాల్లో తక్కువ ధరలకు నిత్యావసరాలు

సామాన్యులకు తక్కువ ధరలకు నిత్యావసర వస్తువులు అందించేందుకు రేషన్ దుకాణాల ద్వారా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. లీటరు పామాయిల్‌ను రూ.125కు, కిలో కందిపప్పును రూ.100కు, కిలో గోధుమ పిండిని రూ.25కు అందించనున్నట్లు వివరించారు. ధరల నియంత్రణ చర్యలు నిరంతరం కొనసాగించాలని, తుపాను బాధితులకు సహాయక చర్యల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఏపీ పరిషత్ పోరులో కూటమి క్లీన్‌స్వీప్!

-మొదటిపేజీ తరువాయి

5,597 ఎంపీటీసీ స్థానాలను గెలుచుకున్నాయి. ఇందులో టీడీపీ అత్యధిక స్థానాలతో అగ్రస్థానంలో నిలిచింది.

జడ్పీటీసీల్లో టీడీపీ హవా

జడ్పీటీసీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంది. రాత్రి 9 గంటల వరకు అందిన ఫలితాల ప్రకారం టీడీపీ 229 స్థానాల్లో విజయం సాధించింది. జనసేన 36, బీజేపీ 8 స్థానాలను దక్కించుకున్నాయి. వైసీపీ 20 స్థానాలకే పరిమితమైంది. ఒక స్థానంలో స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. దీంతో జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించింది.

ఎంపీటీసీల్లోనూ కూటమిదే పైచేయి

మండల పరిషత్ ఎన్నికల్లోనూ కూటమి పార్టీలకు భారీ ఆధిక్యం లభించింది. టీడీపీ 4,823 స్థానాలను గెలుచుకోగా, జనసేన 644, బీజేపీ 130 స్థానాలను కైవసం చేసుకున్నాయి. వైసీపీ 1,050 స్థానాలతో వెనుకబడింది. ఇతరులు, స్వతంత్రులు కలిపి కొన్ని స్థానాల్లో విజయం సాధించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన స్థానాలు కూడా పార్టీల మొత్తం విజయాల గణాంకాల్లో భాగంగా ఉన్నాయి.

70.72 శాతం పోలింగ్ నమోదు

రాష్ట్రవ్యాప్తంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు ఈ నెల 5న పోలింగ్ నిర్వహించారు. కొన్ని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఈ నెల 6న పోలింగ్ చేపట్టారు. రాష్ట్రంలో మొత్తం 2.61 కోట్లకు పైగా ఓటర్లు ఉండగా, సుమారు 1.85 కోట్ల మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మొత్తంగా 70.72 శాతం పోలింగ్ నమోదైంది. 2021లో జరిగిన గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి పోలింగ్ శాతం గణనీయంగా పెరిగింది. విశాఖపట్నం జిల్లాలో అత్యధికంగా 82.51 శాతం పోలింగ్ నమోదు కాగా, అల్లూరి సీతారామరాజు జిల్లాలో అత్యల్పంగా 62.01 శాతం నమోదైంది.

ఏకగ్రీవాలతో కలిపి భారీ ఆధిక్యం

రాష్ట్రంలో మొత్తం 659 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికల ప్రక్రియ చేపట్టగా, 77 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. అదేవిధంగా 9,821 ఎంపీటీసీ స్థానాల్లో 2,051 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మూడు స్థానాలకు నామినేషన్లు దాఖలు కాలేదు. మిగిలిన 7,767 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఏకగ్రీవాలు, పోలింగ్ ద్వారా వచ్చిన విజయాలతో కూటమి తన బలాన్ని మరింత



పెంచుకుంది.

365 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు

రాష్ట్రవ్యాప్తంగా 28 జిల్లాల్లో 365 కేంద్రాలను ఏర్పాటు చేసి ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఇందుకోసం 9,062 కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేశారు. 11,002 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 28,692 మంది సహాయక సిబ్బందిని నియమించారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపుతో ప్రక్రియ ప్రారంభమైంది. ఎంపీటీసీ ఎన్నికలకు గులాబీ రంగు బ్యాలెట్ పత్రాలు, జడ్పీటీసీ ఎన్నికలకు తెలుపు రంగు బ్యాలెట్ పత్రాలను వినియోగించారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 19,885 మంది పోలీసులతో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. సున్నితమైన ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు, డ్రోన్లు, బాడీ కెమెరాలతో పర్యవేక్షణ చేపట్టారు.

వైసీపీ అభ్యంతరాలు.. అక్రమాలపై ఆరోపణలు

ఎన్నికల నిర్వహణలో అధికార యంత్రాంగాన్ని కూటమి ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని వైసీపీ ఆరోపించింది. తమ పార్టీ కార్యకర్తలు, పోలింగ్ ఏజెంట్లను ఇబ్బందులకు గురిచేశారని, కొన్ని ప్రాంతాల్లో అక్రమాలు జరిగినా అధికారులు పట్టించుకోలేదని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. అక్రమాలు జరిగిన ప్రాంతాల్లో తిరిగి పోలింగ్ నిర్వహించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే ఓట్ల లెక్కింపు ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం పర్యవేక్షించింది.

గ్రామీణ రాజకీయాల్లో కూటమికి బలం

మున్సిపల్ ఎన్నికల్లోనూ ఆధిక్యం సాధించిన కూటమి, ఇప్పుడు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ మెరుగైన ఫలితాలు సాధించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. గ్రామీణ ప్రాంతాల్లోనూ కూటమి పట్టు పెరిగిందనే సంకేతాలు ఈ ఫలితాల ద్వారా వెలువడ్డాయి. మరోవైపు వైసీపీకి వచ్చిన ఫలితాలు ఆ పార్టీకి రాజకీయంగా సవాలుగా మారాయి. రానున్న స్థానిక సంస్థల రాజకీయాల్లో ఈ ఫలితాలు ఎలాంటి ప్రభావం చూపుతాయన్నది ఆసక్తికరంగా మారింది.

దక్షిణాదికి బుల్లెట్ రైలు కానుక

న్యూఢిల్లీ: దక్షిణ భారతదేశంలో రైల్వే ప్రయాణ ముఖచిత్రం మారనుంది. ప్రధాన నగరాల మధ్య ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించేలా హైస్పీడ్ రైలు కారిడార్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా బెంగళూరు, హైదరాబాద్, అమరావతి, చెన్నై నగరాలను అనుసంధానించే దక్షిణాది బుల్లెట్ రైలు కారిడార్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆమోదం తెలిపినట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. నవంబర్ 1న బెంగళూరు--ముంబై వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ వివరాలు ప్రకటించారు. ఈ హైస్పీడ్ రైలు కారిడార్ అందుబాటులోకి వస్తే బెంగళూరు--హైదరాబాద్ మధ్య ప్రయాణ సమయం సుమారు 2 గంటల 10 నిమిషాలకు తగ్గనుంది. బెంగళూరు--చెన్నై మధ్య ప్రయాణానికి కేవలం 73 నిమిషాలే పట్టనుంది. దీంతో ఐటీ, పారిశ్రామిక, వాణిజ్య రంగాల్లో కీలకంగా ఉన్న ఈ నగరాల మధ్య రాకపోకలు మరింత వేగవంతం కానున్నాయి. అయితే ప్రాజెక్టు నిర్మాణం, తుది మార్గం, స్టేషన్లు, పనుల ప్రారంభం, పూర్తయ్యే తేదీలపై మరిన్ని అధికారిక వివరాలు వెలువడాల్సి ఉంది.

దక్షిణాదిలో హైస్పీడ్ రైలు నెట్‌వర్క్

బెంగళూరు, హైదరాబాద్, చెన్నై వంటి ప్రధాన నగరాలను అనుసంధానించడం ద్వారా దక్షిణ భారతదేశంలో సమగ్ర ఆర్థిక ప్రాంతం అభివృద్ధి చెందుతుందని కేంద్రం భావిస్తోంది. ఈ నగరాల మధ్య వేగవంతమైన రవాణా సదుపాయాలు ఏర్పడితే ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు, పర్యాటకులకు ఎంతో ప్రయోజనం కలగనుంది. ముఖ్యంగా హైదరాబాద్, బెంగళూరు మధ్య ఐటీ, స్టార్టప్, ఫార్మా, కార్పొరేట్ రంగాల్లో ఇప్పటికే ఉన్న వ్యాపార సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయి. చెన్నైలోని ఆటోమొబైల్, తయారీ పరిశ్రమలకు బెంగళూరులోని సాంకేతిక, కార్పొరేట్ రంగాలతో వేగవంతమైన అనుసంధానం ఏర్పడుతుంది. అలాగే హైదరాబాద్ నుంచి కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలకు ప్రయాణం సులభతరం కానుంది.



ఏడు హైస్పీడ్ కారిడార్లకు బడ్జెట్‌లో ప్రతిపాదన

2026-27 కేంద్ర బడ్జెట్‌లో దేశవ్యాప్తంగా ఏడు హైస్పీడ్ రైలు కారిడార్ల అభివృద్ధిని కేంద్రం ప్రకటించింది. వీటిని ప్రధాన నగరాల మధ్య ఆర్థిక వృద్ధికి దోహదపడే కనెక్టర్లుగా రూపొందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తం సుమారు 4,000 కిలోమీటర్ల మేర ఈ కారిడార్లు విస్తరించనున్నాయి. వీటి ద్వారా దాదాపు రూ.16 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించే అవకాశం ఉందని కేంద్రం అంచనా వేస్తోంది.

ప్రతిపాదించిన ఏడు కారిడార్లు ఇవే:

ముంబై-పుణె, పుణె-హైదరాబాద్, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై, చెన్నై-బెంగళూరు, ఢిల్లీ-వారణాసి, వారణాసి-సిలిగురి ఈ మార్గాల్లో ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అంచనా ప్రయాణ సమయాల ప్రకారం పుణె-హైదరాబాద్ మధ్య 1 గంట 55 నిమిషాలు, హైదరాబాద్-చెన్నై మధ్య 2 గంటల 55 నిమిషాలు, ముంబై-పుణె మధ్య 48 నిమిషాలు, ఢిల్లీ--వారణాసి మధ్య 3 గంటల 50 నిమిషాలు, వారణాసి--సిలిగురి మధ్య 2 గంటల 55 నిమిషాలు పట్టే అవకాశం ఉంది.

ఇప్పటికే నిర్మాణంలో ముంబై--అహ్మదాబాద్ బుల్లెట్ రైలు

భారతదేశపు తొలి బుల్లెట్ రైలు ప్రాజెక్టుగా ముంబై--అహ్మదాబాద్ హైస్పీడ్ రైలు కారిడార్ నిర్మాణం కొనసాగుతోంది. సుమారు 508 కిలోమీటర్ల పొడవైన ఈ ప్రాజెక్టును గంటకు 320 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో రైళ్లు నడిచేలా రూపొందిస్తున్నారు. ఈ మార్గంలో మొత్తం 12 స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నారు. మహారాష్ట్రలో నాలుగు, గుజరాత్‌లో ఎనిమిది స్టేషన్లు ఉండనున్నాయి.

ఆర్థిక రంగానికి కొత్త ఊతం

హైస్పీడ్ రైలు కారిడార్లు అందుబాటులోకి వస్తే నగరాల మధ్య దూరం తగ్గడంతో పాటు ఆర్థిక కార్యకలాపాలు వేగవంతం కానున్నాయి. ఉద్యోగ, వ్యాపార అవకాశాలు పెరగడంతో పాటు పారిశ్రామిక పెట్టుబడులకు కూడా ప్రోత్సాహం లభించనుంది. ముఖ్యంగా హైదరాబాద్--బెంగళూరు మధ్య వేగవంతమైన రైలు కనెక్టివిటీ ఏర్పడితే తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల మధ్య వాణిజ్య సంబంధాలు మరింత విస్తరించే అవకాశం ఉంది. దక్షిణాదిలో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, అమరావతి నగరాలు మరింత చేరువ కావడంతో ప్రాంతీయ అభివృద్ధికి కొత్త మార్గాలు ఏర్పడనున్నాయి.

మేం ఓడినా.. ప్రజల మనసులు గెలుచుకున్నాం



-మొదటిపేజీ తరువాయి

ప్రజాస్వామ్య వ్యవస్థకు విఘాతం కలిగించాయని పేర్కొన్నారు.

అధికారంతో ఎన్నికలు గెలవొచ్చు.. ప్రజల విశ్వాసం కాదు

అధికార బలంతో ఎన్నికల్లో విజయం సాధించవచ్చని, కానీ ప్రజల విశ్వాసాన్ని మాత్రం గెలుచుకోలేరని జగన్ వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యాన్ని అణచివేయగలరేమో కానీ, ప్రజల ఆకాంక్షలను అణచివేయడం సాధ్యం కాదని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఎదురైన పరిణామాల నేపథ్యంలో తమ పార్టీ నైతికంగా ప్రజల మద్దతు పొందిందని అభిప్రాయపడ్డారు.

పార్టీ శ్రేణులకు అభినందనలు

ఎన్ని అడ్డంకులు ఎదురైనా, దాడులు జరిగినా, నిర్బంధాలు విధించినా వెనుకడుగు వేయకుండా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడిన పార్టీ నాయకులు, కార్యకర్తలను జగన్ అభినందించారు. ముఖ్యంగా మహిళా కార్యకర్తల పోరాట స్ఫూర్తిని ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ పోరాటాలను మరింత దృఢంగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజల ఆశీస్సులు, నమ్మకంతో తమ రాజకీయ ప్రయాణం ముందుకు సాగుతుందని వైఎస్ జగన్ పేర్కొన్నారు.

వైసీపీ కంచుకోటలో టీడీపీ జెండా..
కడప జిల్లాలో కూటమి ప్రభంజనం!



వైసీపీకి కంచుకోటగా భావించే ఉమ్మడి కడప జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సత్తా చాటింది. జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో భారీ విజయాలు నమోదు చేసింది. మొత్తం 39 జడ్పీటీసీ స్థానాలకు గానూ 23 ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 16 స్థానాలకు 71 మంది అభ్యర్థులు పోటీ పడగా.. 13 చోట్ల కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. జిల్లాలో టీడీపీ 30, భాజపా 3, జనసేన 3 జడ్పీటీసీ స్థానాలను దక్కించుకున్నాయి. వైసీపీ కేవలం రెండు స్థానాలకే పరిమితమైంది. వైసీపీ అధినేత జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలోనూ టీడీపీ జెండా ఎగిరింది. అక్కడ టీడీపీ అభ్యర్థి భారతి 1,463 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రాజంపేట మండలంలో టీడీపీ అభ్యర్థి పోలి సుబ్బారెడ్డి 17,440 ఓట్ల భారీ ఆధిక్యంతో విజయం సాధించారు. లింగాల జడ్పీటీసీగా టీడీపీ అభ్యర్థి యమ్మనూరు సరళాదేవి గెలుపొందారు. ఎంపీటీసీ స్థానాల్లోనూ కూటమి ఆధిపత్యం ప్రదర్శించింది. జిల్లాలో 351 ఎంపీటీసీ స్థానాలు ఇప్పటికే ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 55 స్థానాలకు ఎన్నికలు జరగ్గా.. 30కి పైగా చోట్ల కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. మరికొన్ని స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందగా.. అక్కడక్కడ వైసీపీ అభ్యర్థులు విజయం సాధించారు.

పరిషత్ ఎన్నికల్లో ఆసక్తికర ఘటనలు
జగన్ మేనత్త ఊరిలో టీడీపీ..
తోడికోడళ్ల పోరులో జనసేన పైచేయి!



ఎన్టీఆర్ జిల్లా గణపవరంలో 20 ఏళ్ల తర్వాత టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థి విజయం సాధించారు. ఈ గ్రామం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సోదరి, జగన్ మేనత్త విమలమ్మ స్వగ్రామం కావడం గమనార్హం. నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలం తమ్మినపట్నంలో టీడీపీ అభ్యర్థి అరుణ రీకౌంటింగ్ తర్వాత ఒక్క ఓటు తేడాతో గెలుపొందారు. తొలుత ఆరు ఓట్ల తేడా రావడంతో అధికారులు మళ్లీ లెక్కింపు చేపట్టారు. ఫలితం వెలువడిన తర్వాత వైకాపా అభ్యర్థి కౌంటింగ్ కేంద్రం వద్ద బైఠాయించి న్యాయం చేయాలని ఆందోళనకు దిగారు. తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలం చంద్రవరం ఎంపీటీసీ స్థానంలో టీడీపీ అభ్యర్థి కాట్రూ శ్రీనివాసరావు కేవలం మూడు ఓట్ల అధిక్యంతో విజయం సాధించారు. పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలం మాతుమూరు, పాంచాలి ఎంపీటీసీ స్థానాల్లో టీడీపీ అభ్యర్థులుగా పోటీ చేసిన తండ్రి జి.యుగంధర్, కుమార్తె కావ్య గెలుపొందారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం పెదమల్లంలో తోడికోడళ్ల మధ్య జరిగిన పోరులో జనసేన అభ్యర్థి బోడపాటి మంగదేవి 18 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి 1, 2 ఎంపీటీసీ స్థానాల్లో వైకాపా అభ్యర్థులు తుమ్మ కల్పన, గొడుగుల బంగార్రాజు గెలుపొందారు. నక్కపల్లి-2 పరిధిలోనే హోంమంత్రి అనిత నివాసం ఉండటం గమనార్హం. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని ఏఎం రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు సందర్భంగా బ్యాలెట్ బాక్సులో ఓట్లతోపాటు కరపత్రాలు బయటపడ్డాయి. సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల బ్యాలెట్ బాక్సుల్లో ఈ కరపత్రాలను గుర్తించారు. గ్రామానికి వెళ్లే రహదారిలో రైల్వే గేటు వద్ద యూ ఆకారంలో అండర్‌పాస్ నిర్మించవద్దని, ప్రధాన రహదారికి అనుసంధానంగా బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్థులు వాటిలో విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ స్పందించాలని కోరారు. తిరుపతి రూరల్ జడ్పీటీసీ స్థానంలో వైకాపా అభ్యర్థి చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, టీడీపీ అభ్యర్థి ధనలక్ష్మి తరఫున వారి కుటుంబ సభ్యులు కౌంటింగ్ కేంద్రానికి వచ్చి లెక్కింపును పరిశీలించారు. మరోవైపు పోస్టల్ బ్యాలెట్లలో చెల్లని ఓట్లు భారీగా నమోదయ్యాయి. అల్లూరి జిల్లా అనంతగిరిలో 137 పోస్టల్ ఓట్లకు 91 చెల్లనివిగా తేలాయి.

మెరుగైన జీవనశైలిపై మహిళలకు అవగాహన

పుల్లలచెరువు, నవంబర్ 7 (మీ వార్త) మెరుగైన జీవనశైలి విధానాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పుల్లలచెరువు మండలంలోని వివిధ గ్రామాల్లో ఏడు రోజుల పాటు పొదుపు సంఘాల మహిళలతో అవగాహన సమావేశాలు, ర్యాలీలు నిర్వహించారు. నవంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో మహిళలకు పర్యావరణ పరిరక్షణ, వనరుల పొదుపు, ఆరోగ్యకరమైన జీవన విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపీఎం వెంకటయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ రోజువారీ జీవితంలో సుస్థిర జీవనశైలి విధానాలను అలవర్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఏడు అంశాలపై మహిళలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. విద్యుత్‌ను అవసరమైన మేరకే వినియోగిస్తూ పొదుపు చేయడం, నీటిని వృథా చేయకుండా సంరక్షించడం, సుస్థిర ఆహార విధానాలను పాటించడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు స్వస్తి పలకడం, చెత్తను తగ్గించడం, ఎలక్ట్రానిక్ వ్యర్థాల వినియోగాన్ని నియంత్రించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం వంటి అంశాలను వివరించారు. ప్రకృతి వనరులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని, నేటి తరం అనుసరించే పొదుపు విధానాలే



భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. మహిళలు తమ కుటుంబాలతో పాటు గ్రామాల్లోని ఇతరులకు కూడా ఈ అంశాలపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో డీఆర్‌డీఏ సిబ్బంది, వివిధ గ్రామాల వీవోఏలు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఈ సారి కూడా ఎంపీపీ పీఠం స్వతంత్రులదేనా ...!

జి మాడుగుల (మీ వార్త ప్రతినిధి) జిమాడుగుల ఎంపీపీ పీఠం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ పదవిని దక్కించుకున్న తెలుగుదేశం పార్టీ 2026 ఎన్నికల్లోను పట్టు నిలుపుకోవాలని విశ్వ ప్రయత్నాలు చేసిన, చివరికి రాజకీయ సమీకరణాలు, మార్పులు జరిగి, ఈ పదవి కోసం జరిగిన పరిణామాలు ఈసారి ఎన్నికల్లో ఆసక్తిని రేకెత్తించాయి. అయితే గతంలో 2021 స్థానిక సంస్థల ఎంపీటీసీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఏడుగురు, వైసిపి పార్టీ నుంచి ఏడుగురు ఎన్నిక కాగా, ఒక స్వతంత్ర అభ్యర్థి గెలిచారు. దీంతో ఇరు పార్టీలలో సరైన మెజార్టీ లేక స్వతంత్ర అభ్యర్థికి ఎంపీపీ పీఠం అప్పచెప్పిన సందర్భం నెలకొనడంతో ఈసారి ఎలాగైనా పట్టు సాధించాలని ఇరు పార్టీలు తగ్గా పోరుగా పోటా పోటీ, గా ఎన్నికలలో తలపడ్డారు.. కౌంటింగ్ సమయంలో చివరి వరకు టిడిపి వైసిపి అభ్యర్థుల ఫలితాలు చూస్తే ఆదిక్యం మాదే అంటే మాదే.. అన్నట్టుగా విజేతల ఓటింగ్ కౌంటింగ్ రౌండ్లు జరగగా, చివరకు టిడిపికి ఐదుగురు అభ్యర్థులు, వైసీపీ పార్టీ కి ఏడుగురు. అభ్యర్థులు స్వతంత్రులు ముగ్గురు గెలుపొందారు. దీనితో ఎంపీటీసీ అభ్యర్థుల సంఖ్య 15 స్థానాలకు గాను వైసీపీకి ఏడు స్థానాలు టీడీపీకి ఐదు స్థానాలు స్వతంత్రులు ముగ్గురు రావడంతో ఎంపీపీ పీఠం అధిష్టించాలంటే ఎనిమిది మంది అభ్యర్థులు కావలసి ఉండగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కి ఏడు స్థానాలు, టీడీపీకి ఐదు స్థానాలు కాబట్టి ఈసారి కూడా స్వతంత్ర అభ్యర్థులే ఎంపీపీ పీఠం దక్కించుకుంటారా..? ఈసారి ఎంపీపీ పీఠం మహిళకు కేటాయించడంతో ఈ పదవులు దక్కించుకోవాలని కూటమి, వైకాపా పార్టీ నేతలు పావులు కదుపుతున్నారు. చివరకు ఏం జరుగుతుందో , ఏ స్వతంత్ర అభ్యర్థికి ఎంపీపీ పీఠం దక్కుతుందో వేచి చూడాల్సిందే....!!



భారీ మెజారిటీతో లింగోలు నాగ పావని ఘన విజయం..

అమలాపురం రూరల్ జెడ్పీటీసీగా జనసేన అభ్యర్థిని విజయదుందుభి..

అమలాపురం, మీ వార్త ప్రతినిధి, నవంబర్, 7 అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం రూరల్ మండలం జెడ్పీటీసీ ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థిని లింగోలు నాగ పావని భారీ విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థిపై 11,929 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. భారీ ఆధిక్యంతో విజయం సాధించడంతో జనసేన శ్రేణులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.



వైట్‌హౌస్‌లో ట్రంప్ దీపావళి..

అధ్యక్షుడికి 'హనుమాన్ చాలీసా' బహూమతి
వైట్‌హౌస్‌లో ఘనంగా దీపావళి వేడుకలు జరిపిన ట్రంప్
ఓవల్ ఆఫీస్‌లో దీపం వెలిగించి వేడుకలను ప్రారంభించిన అధ్యక్షుడు
ట్రంప్‌కు హనుమాన్ చాలీసాను బహూకరించిన వ్యాపారవేత్త విశాల్ గోండల్
పాల్గొన్న భారత రాయబారి, ప్రముఖ భారతీయ అమెరికన్ సీఈఓలు
భారత్–అమెరికా మైత్రి వర్ధిల్లాలని, చీకటిపై వెలుగు గెలవాలని ఆకాంక్ష

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌లోని తన అధికారిక కార్యాలయం ఓవల్ ఆఫీస్‌లో దీపావళి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. నిన్న జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖ భారతీయ–అమెరికన్ పారిశ్రామికవేత్తలు, సీఈఓలు, ఆయన ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ స్వయంగా దీపం వెలిగించి వేడుకలను ప్రారంభించారు. ఈ వేడుకకు అమెరికాలోని భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ డైరెక్టర్ జయ్ భట్టాచార్య వంటి ప్రముఖులు హాజరయ్యారు. వీరితో పాటు మైక్రాన్ టెక్నాలజీ సీఈఓ సంజయ్ మెహ్రోత్రా, ఐబీఎం సీఈఓ అరవింద్ కృష్ణ, ప్రముఖ చెఫ్ వికాస్ ఖన్నా, సోషల్ సెక్యూరిటీ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ కమిషనర్ అర్జున్ మోదీ కూడా ఈ వేడుకల్లో పాలుపంచుకున్నారు. ట్రంప్‌కు హనుమాన్ చాలీసా బహూకరణఈ కార్యక్రమంలో ఒక ఆసక్తికరమైన సంఘటన చోటుచేసుకుంది. ప్రముఖ పారిశ్రామికవేత్త, జీఓక్యూఐఐ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు విశాల్ గోండల్, అధ్యక్షుడు ట్రంప్‌కు 'హనుమాన్ చాలీసా' పుస్తకాన్ని బహూకరించారు. ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' ద్వారా పంచుకున్నారు. "ధైర్యం, భక్తి, శక్తి కోసం కోట్లాది మంది పఠించే తులసీదాస్ రచించిన హనుమాన్ చాలీసాను అధ్యక్షుడికి బహూమతిగా ఇవ్వడం గౌరవంగా భావిస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు. దీపాలు వెలిగించినప్పుడు, భారత్–అమెరికా మధ్య స్నేహం వర్ధిల్లాలని, చీకటిపై వెలుగు విజయం సాధించాలని తాను ప్రార్థించినట్లు గోండల్ తెలిపారు. శాంతి, శ్రేయస్సు, ఆరోగ్యం ప్రపంచమంతటా వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో ధల్లా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ సీఈఓ రూబీ ధల్లా, న్యాక్ సిస్టమ్స్ వ్యవస్థాపకుడు రాజీవ్ శర్మ, కేశవం డీసీ ప్రెసిడెంట్ విశ్వజిత్ మల్లంపాటి వంటి పలువురు వ్యాపారవేత్తలు కూడా పాల్గొన్నారు. వైట్‌హౌస్‌లో దీపావళి వేడుకలను జరపడం 2003లో అప్పటి అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యూ బుష్ హయాంలో ప్రారంభమైంది. అయితే, 2009లో బరాక్ ఒబామా వైట్‌హౌస్‌లో స్వయంగా దీపం వెలిగించిన తొలి అధ్యక్షుడిగా నిలిచారు. అప్పటి నుంచి ఈ సంప్రదాయం కొనసాగుతోంది. ట్రంప్ హయాంలో ఈ వేడుకలను ఓవల్ ఆఫీస్‌లో నిర్వహించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.



ఓట్ల చీలిక ఎవరికి దెబ్బ

లక్నో : యూపీలో భారతీయ జనతా పార్టీ రాజకీయ ఆధిపత్యానికి మునుపెన్నడూ లేనంతగా సవాళ్లు ఎదురవుతున్నాయి. జాతీయ భద్రత, బలమైన కేంద్ర నాయకత్వం ప్రధాన అజెండాగా సాగిన లోక్‌సభ ఎన్నికల్లోనే యూపీ ఓటర్లు బీజేపీకి ఊహించని షాక్ ఇవ్వడం పార్టీకి మేల్కొలుపుగా మారింది. దాదాపు దశాబ్ద కాలంగా అధికారంలో ఉన్న యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని డబుల్ ఇంజిన్ సర్కార్‌పై పాలనాపరమైన అసంతృప్తి క్షేత్రస్థాయిలో విస్తరిస్తోందన్న సంకేతాలు వెలువడుతున్నాయి. జాతీయ నినాదాలే పూర్తిస్థాయిలో ప్రభావం చూపలేకపోయిన తరుణంలో, పూర్తిగా స్థానిక, సామాజిక అంశాల చుట్టూ తిరిగే అసెంబ్లీ సమరంలో కమలనాథులకు పెను పరీక్ష తప్పేలా లేదు.యోగి ప్రభుత్వంపై పెరుగుతున్న అసంతృప్తికి ప్రధానంగా నిరుద్యోగం, ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల పేపర్ లీకేజీలు, వ్యవసాయ సంక్షోభం, పెరిగిపోయిన ద్రవ్యోల్బణం వంటి క్షేత్రస్థాయి సమస్యలే ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. వీటికితోడు శాంతిభద్రతల పేరిట జరిగిన కొన్ని కఠిన చర్యలు, బుల్డోజర్ న్యాయం కొన్ని సామాజిక వర్గాల్లో భయాందోళనలను, వ్యతిరేకతను పెంచాయి. ముఖ్యంగా ఓబీసీ, దళిత వర్గాలలో ప్రభుత్వ ప్రాధాన్యతలపై తలెత్తిన అనుమానాలు బీజేపీ సాంప్రదాయ ఓటు బ్యాంకులో చీలిక తెచ్చాయి. మరోవైపు ప్రభుత్వ యంత్రాంగం , పార్టీ క్యాడర్ మధ్య సమన్వయ లోపం, మంత్రులు–ఉపముఖ్యమంత్రుల మధ్య తలెత్తిన అంతర్గత విభేదాలు కూడా పాలనపై ప్రభావం చూపుతున్నాయి.ఈ రాజకీయ శూన్యతను సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ అత్యంత చాకచక్యంగా తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. గతంలో ఉన్న కేవలం యాదవ–ముస్లిం సమీకరణ పరిధిని దాటి, ఆయన ప్రయోగించిన పీడీఏ వెనుకబడిన, దళిత, మైనారిటీ వర్గాలు సామాజిక ఫార్ములా క్షేత్రస్థాయిలో విస్తృత ఆదరణ పొందుతోంది. రాజ్యాంగ పరిరక్షణ, కులగణన, రిజర్వేషన్ల హక్కుల పరిరక్షణను ప్రధాన అజెండాగా మార్చి అఖిలేష్ నిరంతరం ప్రజల్లో ఉండటం సమాజ్‌వాదీ పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. బహుజన్ సమాజ్ పార్టీ ప్రభావం గణనీయంగా తగ్గడంతో, బీజేపీ వ్యతిరేక ఓటుకు ఎస్పీయే ఏకైక ప్రత్యామ్నాయంగా నిలవడం అఖిలేష్ రాజకీయ గ్రాఫ్‌ను భారీగా పెంచింది.అయితే రాబోయే రాజకీయ పోరులో బీజేపీని ఎదుర్కోవడం అఖిలేష్‌కు నల్లేరుపై నడకేమీ కాదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. యోగి ఆదిత్యనాథ్‌కు వ్యక్తిగతంగా ఉన్న బలమైన హిందుత్వ ఇమేజ్, బీజేపీకి ఉన్న పటిష్టమైన బూత్ స్థాయి నెట్‌వర్క్, కేంద్ర పథకాల లబ్ధిదారుల వర్గం ఇప్పటికీ కాషాయ పార్టీకి కొండంత అండగా ఉన్నాయి.

డొనాల్డ్ ట్రంప్‌కు కోర్టుల్లో గట్టి ఎదురుదెబ్బ

న్యూయార్క్ : అమెరికాలో మధ్యంతర ఎన్నికల వేళ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు కోర్టుల్లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కాలిఫోర్నియాలో సుమారు 20 వేల వివాదాస్పద మెయిల్ బ్యాలెట్లను పక్కన పెట్టాలన్న ట్రంప్ ప్రభుత్వ ప్రయత్నాన్ని న్యాయస్థానాలు అడ్డుకున్నాయి. చివరకు అమెరికా సుప్రీంకోర్టు కూడా ట్రంప్ అభ్యర్థనను తిరస్కరించింది.కాలిఫోర్నియాలో సుమారు 20 వేల మంది ఓటర్లు అమెరికా పౌరులు కాకపోవచ్చని ట్రంప్ ప్రభుత్వం అనుమానం వ్యక్తం చేసింది.వీరు ఓటు వేయడానికి అర్హులు కాదని అమెరికా న్యాయశాఖ ఆరోపించింది.ఈ ఓటర్లకు సంబంధించిన బ్యాలెట్లను వెంటనే పక్కన పెట్టాలని రాష్ట్ర ఎన్నికల అధికారులను కోరింది.ట్రంప్ సర్కార్ ఆరోపణలపై కాలి ఫోర్నియా ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. దీనికి కాలిఫోర్నియా పలు అంశాలను లేవనెత్తింది. ఇందులో..కాలిఫోర్నియాలో ఇప్పటికే ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది.లక్షలాది మంది ఓటర్లు తమ బ్యాలెట్లను తిరిగి పంపించారు.ట్రంప్ ప్రభుత్వం ఇచ్చిన జాబితాలో అనేక తప్పులున్నాయని కాలిఫోర్నియా అధికారులు వాదించారు.ఆ జాబితాలో అమెరికా పౌరులు, ఓటరు నమోదును క్రియాశీలంగా కొనసాగించని వ్యక్తులు కూడా ఉన్నారని పేర్కొన్నారు.

గూడూరు జడ్పీటీసీ చోడగం నాంచారమ్మ, రామ రాజు పాలెం ఎంపిటిసి బొల్లా రాజేష్

గూడూరు కూటమి నాయకులు



గూడూరు నవంబర్ 7(మీ వార్త ప్రతినిధి) గూడూరు మండల ఎన్నికల అధికారి పి.శైలజా కుమారి నుంచి ప్రొసీడింగ్ కాపీ అందుకుంటున్న తెలుగుదేశం పార్టీ గూడూరు మండల జడ్పీటీసీగా ఎన్నికైన చోడగం నాంచారమ్మ, రామరాజు పాలెం ఎంపీటీసీగా ఎన్నికైన ఎంపీపీ అభ్యర్థి బొల్లా రాజేష్, మండల కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైలు పేట యు పి హెచ్ సి పరిధిలో దోమల నియంత్రణ, నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ రిలీజ్



మచిలీపట్నం నవంబర్ 7(మీ వార్త ప్రతినిధి) జిల్లా వైద్య శాఖా అధికారి దయాకర్ , జిల్లా మలేరియా అధికారి జ్ఞానశ్రీ ఆదేశాల మేరకు ఈ రోజు రైలుపేట యూ.పి.హెచ్.సి పరిధిలోని రైలుపేట ఏరియాలో దోమల నియంత్రణ లో భాగంగా నీటి నిల్వల ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ రిలీజ్ చేయడం జరిగింది, ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం లో వైద్య సిబ్బంది అయినా హెల్త్ సూపర్ వైజర్స్ రాఘవేంద్ర రావు , సూరిబాబు , హెల్త్ అసిస్టెంట్ చంద్రమోహన్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

గూడూరు కప్పల దొడ్డి ఎంపిటిసి వైయస్సార్సీపి బలపరచిన సీపీఐ నేత గెలుపు



గూడూరు నవంబర్ 7 (మీ వార్త ప్రతినిధి) కప్పలదొడ్డి సెగ్మెంట్లో 25ఓట్ల మెజారిటీ తో విజయదుందుభి మోగించిన వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సిపిఐ అభ్యర్థి యక్కల పీతాంబరధరరావు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

మచిలీపట్నం చిలకలపూడి యుపిహెచ్సి పరిధిలో తుఫాన్ కారణంగా నిల్వ ఉన్న నీటిలో

ఆయిల్ బాల్స్ మురుగు నీటి లో

వైద్య ఆరోగ్య సిబ్బంది



చిలకల పూడి నవంబర్ 7(మీ వార్త ప్రతినిధి) ఈరోజు చిలకలపూడి యు పి హెచ్ సి పరిధిలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మరియు జిల్లా మలేరియా అధికారి ఆదేశాలను అనుసిరించి 5.వ సచివాలయం పరిధిలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ మురళి చేతుల మీదుగా ఆయిల్స్ బాల్స్ మురికి నీరు గుంటలలో వేయటం జరిగింది. ఈ కార్యక్రమం లో వైద్య సిబ్బంది హెల్త్ సూపర్ వైజర్స్ రాఘవేంద్ర రావు, భట్రాజు సూరిబాబు, హెల్త్ అసిస్టెంట్ కోటేశ్వరరావు, బాబ రామ్మోహనరావు పాల్గొన్నారు.

ముచ్చర్ల గ్రామ సర్పంచ్ ఎన్నికలలో కూటమి తరపున శ్రీ చీలి జాన్మోహన్ రావు కి సర్పంచ్ అభ్యర్థిగా అవకాశం కల్పించండి



పెడన నవంబర్ 7(మీ వార్త ప్రతినిధి) పెడన మండలం ముచ్చర్ల గ్రామ సర్పంచ్ అభ్యర్థి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో, పెడన మండలం ముచ్చర్ల గ్రామ సర్పంచ్ ఎన్నికలలో కూటమి తరపున శ్రీ చీలి జాన్మోహన్ రావు కి సర్పంచ్ అభ్యర్థిగా అవకాశం కల్పించడం జరిగింది. ఈ సీటును జనసేన పార్టీకి కేటాయించడం జరిగింది. కావున జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు కూటమి శ్రేణులందరూ పరస్పర సహకారంతో ముందుకు సాగుతూ, ఐక్యతను చాటాలని కోరుకుంటున్నాము. కూటమి నాయకులందరూ సమన్వయంతో పనిచేస్తూ, గ్రామ అభివృద్ధి కోసం తమ సహకారాన్ని అందించాలని మనస్ఫూర్తిగా విజ్ఞప్తి చేస్తున్నాము. జై జనసేన! జై తెలుగుదేశం! జై కూటమి!

?కృత్తివెన్ను టిడిపి సీనియర్ నాయకులు పిన్నెంటిరత్తయ్య దీపావళి శుభాకాంక్షలు.



కృత్తివెన్ను, నవంబర్ 07: (మీ వార్త ప్రతినిధి) దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని కృత్తివెన్ను మండల టిడిపి సీనియర్ నాయకులు పిన్నెంటి రత్తయ్య దీపావళి సందర్భంగా కూటమి నాయకులకు నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిదులకు మండల ప్రజలకు అధికారులకు మీడియా మిత్రులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, ప్రతి ఇంటా సుఖసంతోషాలు, సిరిసంపదలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దీపావళి పండుగ ప్రతి ఒక్కరిలో సరికొత్త ఆశలు, సానుకూల ఆలోచనలు, నూతన ఉత్సాహాన్ని నింపాలని పేర్కొన్నారు. ప్రజల మధ్య ప్రేమాభిమానాలు, సోదరభావం, ఐక్యత మరింత బలపడాలని, సమాజంలో శాంతి, సామరస్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి దీపావళి వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, పండుగ సంబరాల సమయంలో తగిన జాగ్రత్తలు పాటిస్తూ, పర్యావరణానికి మరియు ఇతరులకు ఇబ్బంది కలగకుండా సురక్షితంగా దీపావళిని జరుపుకోవాలని సీనియర్ టిడిపి నాయకులు పిన్నెంటి రత్తయ్య సూచించారు.

జి మాడుగుల ఎంపీటీసీ స్థానాలకు వైసీపీ ఏడు, టీడీపీ ఐదు, స్వతంత్రులు ముగ్గురు .. గెలుపు

జి మాడుగుల (మీ వార్త ప్రతినిధి) జి మాడుగుల మండలంలో 15 ఎంపీటీసీ స్థానాలకు గాను యాభై ఎనిమిది మంది ఎంపీటీసీ అభ్యర్థులుగా బరిలో నిలవగా 15 సెగ్మెంట్లలో ప్రధాన పార్టీ లైనా టిడిపి, జనసేన, బిజెపి, వైసిపి, సిపిఐ, ప్రధాన పార్టీలతో, పాటు స్వతంత్ర అభ్యర్థులు బరిలో నిలిచారు. 15 ఎంపీటీసీ సెగ్మెంట్లలో, టిడిపి 5చోట్ల, వైఎస్ఆర్సిపి 7 చోట్ల ,స్వతంత్ర అభ్యర్థులు 3 చోట్ల, ఎంపీటీసీ అభ్యర్థులు గా గెలుపొందారు..
టిడిపి ఎంపీటీసీ అభ్యర్థులు. జిమాడుగుల 1: మత్స్యరాస నారాయణరాజు. జిమాడుగుల 2: గబ్బాడి శాంతి కుమారి. కే కోడపల్లి కొండపల్లి దొర. సొలబం కె. మల్లమ్మ. గెమ్మిలి పి దేవి.వైయస్సార్సీపి ఎంపీటీసీ అభ్యర్థులు.. బీరం ఎంపీటీసీ అభ్యర్థి ఎన్ రాజమ్మ. గడుతురు బి ,చిన్న కొండబాబు.. పాలమామిడి జి, కమలమ్మ .. సింగర్భ పి, రామకృష్ణ.. కుంబిడిసింగి టి, వెంకటరమణ.. బొయితిలి జీ, సుభాషిని.. పెదాలువ్వసింగి వి, సునీత.. స్వతంత్ర అభ్యర్థులు.. ఎంపీటీసీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థులుగా గెలుపొందిన అభ్యర్థులు . కోరపల్లి కే ,కొండబాబు.. పెద్దలోచలి కే ,రమేష్.. వంజరి పి గిరిబాబు.. స్వతంత్ర అభ్యర్థులుగా గెలుపొందారు

గూడూరు జడ్పిటిసి అభ్యర్థి చోడగం నాంచారమ్మ 7,501 ఓట్ల మెజార్టీతో ఘన విజయం



గూడూరు నవంబర్ 7 (మీ వార్త ప్రతినిధి) జడ్పీటీసీ కూటమి అభ్యర్థి చోడగం నాంచారమ్మ 7,501 ఓట్ల తో తన సమీపవైసీపీ అభ్యర్థి పై ఘన విజయం సాధించారు. ఎన్నికల్లో ఓటర్లు ఆయనకు విశేష ఆదరణ చూపించి భారీ మెజారిటీతో గెలిపించారు. ఈ విజయానికి తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేశారు. ప్రచార సమయంలో ప్రతి కార్యకర్తను ఆప్యాయంగా పలకరిస్తూ, చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరినీ గౌరవిస్తూ ముందుకు సాగిన ఉదయ్‌కు కూటమి శ్రేణుల నుంచి విశేష మద్దతు లభించింది. ఫలితాలు వెలువడిన వెంటనే టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు ఆయనకు అభినందనలు తెలిపారు. తన విజయానికి సహకరించిన మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఓటర్లందరికీ రావెళ్ల ఉదయ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

కుక్కునూరులో కూటమి అభ్యర్థి పిచ్చుకల రాజు ఘన విజయం



కుక్కునూరు: కుక్కునూరు మండలంలో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి పిచ్చుకల రాజు విజయం సాధించారు. ఎన్నికల ఓట్ల లెక్కింపులో ప్రత్యర్థులపై ఆధిక్యం సాధించి ఎంపీటీసీగా గెలుపొందారు. కూటమి అభ్యర్థి విజయంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పిచ్చుకల రాజుకు అభినందనలు తెలిపారు. ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలిచిన ఓటర్లకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

పుల్లల చెరువు మండలంలో విజయదుందుభి మోగించిన జనసేన.

వైసిపీ కోటలో కూటమి పాగా. పుల్లల చెరువు,



నవంబర్ 7(మీ వార్త) పుల్లల చెరువు మండలంలో జరిగిన జడ్పిటి సి ఎన్నికలలో కూటమి (జనసేన) విజయదుందుభి మోగించింది.జడ్పిటిసి ఎన్నికలలో కూటమి (జనసేన)అభ్యర్థి కోటారి అచ్చయ్య ఘన విజయం సాధించారు.ఎన్నికలలో త్రిముఖపోటీ ఎదురైంది. సీపీఐ పార్టీ తరపున గోపవరపు. గురునాదం. వైఎస్సా ర్ సీపీ తరపున ఆవుల. కోటి వీరారెడ్డి, కూటమి (జనసేన)పార్టీ అభ్యర్థిగా కోటారి. అచ్చయ్య లు బరిలోనిలిచారు.పోటీ జనసేన, వైఎస్సార్ సీపీ అభ్యర్థుల మధ్యే నడిచింది.అన్ని రౌండ్లలోనూ వైఎస్సా ర్ సీపీ అభ్యర్థికంటే మెజారిటి సాధించడంతో కూటమి సత్తా నిరూపించుకుంది.గత ఇరవై ఏళ్లుగా వైసిపీ కి కంచుకోటగా వున్న పుల్లల చెరువు మండలంలో కూటమి పాగా వేసింది.వైసిపీ అభ్యర్థి ఆవుల. కోటివీరారెడ్డి కంటే కూటమి(జనసేన)అభ్యర్థి కోటారి. అచ్చయ్య 4007 ఓట్ల తో ఘనవిజయం సాధించారు. ఈ విజయంతో కూటమి నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తంచేస్తున్నారు మండంలోని గ్రామాల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. గత ఇరవై సంవత్సరాలుగా వైఎస్సార్ సీపీకి కంచుకోటగా వున్న మండలంలో జడ్పి టీసి పదవీ చేజారిపోవటం ఆపార్టీకి దెబ్బేతగిలింది, ఎంపిపి, జడ్పిటిసి, 14 ఎంపిటిసి పదవులు కూటమి ఖాతాలో జమ అయ్యాయి.

జి మాడుగుల సెగ్మెంట్ 1.2.టిడిపి అభ్యర్థుల విజయ భేరీ..

సెగ్మెంట్.1.అభ్యర్థి
మత్స్యరాస నారాయణరాజు
సెగ్మెంట్ 2 . అభ్యర్థి గబ్బాడి కుమారి





జి మాడుగుల (మీ వార్త ప్రతినిధి) జి మాడుగుల మండలంలో ఎంపీటీసీ జి మాడుగుల సెగ్మెంట్ 1, సెగ్మెంట్ 2, లో టిడిపి అభ్యర్థులు ఘన విజయం సాధించారు. టిడిపి పార్టీ అభ్యర్థులైన జీ మాడుగుల సెగ్మెంట్ 1 నుంచి మత్స్యరాస నారాయణరాజు, సెగ్మెంట్ 2 నుంచి గబ్బాడి కుమారి, ఘన విజయం సాధించారు .ఈ ఎన్నికల్లో టిడిపి జనసేన కూటమి పార్టీ నుంచి బి ఫారం అందుకున్న వీరు ఇరువురు సైకిల్ గుర్తుపై పోటీ చేశారు. స్థానిక ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, గ్రామీణ ప్రాంతాల్లో ముమ్మరంగా ప్రచారం నిర్వహించి ఓటర్ల మద్దతు కూడగట్టారు. నారాయణరాజు ,కుమారి, గెలుపుతో టిడిపి శ్రేణులు అభిమానులు మండలంలో సంబరాలు జరుపుకున్నారు...

గూడూరు మండలం ఎంపీపీ గా విజయం సాధించిన బొల్లా రాజేష్ కు ఘన స్వాగతం పలికిన ప్రజలు



గూడూరు నవంబర్ 7 (మీ వార్త ప్రతినిధి) గూడూరు మండలం తెలుగుదేశం పార్టీ రామరాజు పాలెం ఎంపీటీసీగా ఎన్నికైన ఎంపీపీ అభ్యర్థి బొల్లా రాజేష్, మండల కూటమి నాయకులు అందరూ కలిసి గజమాలతో సత్కారం , ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మండల నాయకులు ,గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏడు ఎంపీటీసీ స్థానాల్లో వైసిపి విజయభేరి ..

సింగర్భ, కుంబిడి సింగీ, బోయితిలి, గడుతూరు,పెదాలువ్వసింగి, పాలమామిడి, బీరం..





జి మాడుగుల (మీ వార్త ప్రతినిధి) జి మాడుగుల మండలంలో 15 ఎంపీటీసీ స్థానాలకు గాను ఏడు ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకున్న వైయస్సార్సీపి అభ్యర్థులు ఘన విజయం సాధించారు. వైసీపీ పార్టీ అభ్యర్థులైన, కుంబిడి సింగీ ఎంపీటీసీ అభ్యర్థి . తలారి వెంకటరమణ. పెద లువ్వసింగి ఎంపీటీసీ అభ్యర్థి వంతల సునీత. సింగర్భ ఎంపిటిసి అభ్యర్థి పాంగీ రామకృష్ణ. పాలమామిడి ఎంపీటీసీ అభ్యర్థి గెమ్మిలి కమలమ్మ. గడుతురు ఎంపీటీసీ అభ్యర్థి బోనంగి చిన్న కొండబాబు. బోయితొలి ఎంపిటిసి అభ్యర్థి గాదేశి సుభాషిని. బీరం ఎంపీటీసీ అభ్యర్థి ఎన్ , రాజమ్మ. ఘన విజయం సాధించారు .ఈ ఎన్నికల్లో వైయస్సార్సీపి నుంచి నుంచి బి ఫారం అందుకున్న వీరు ఏడుగురు ప్యాన్ గుర్తుపై పోటీ చేశారు. స్థానిక ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, గ్రామీణ ప్రాంతాల్లో ముమ్మరంగా ప్రచారం నిర్వహించి ఓటర్ల మద్దతు కూడగట్టారు. మండలంలో వైయస్సార్ పార్టీ గెలుపుతో పార్టీ శ్రేణులు అభిమానులు మండలంలో సంబరాలు జరుపుకున్నారు...

?ఏలూరు పార్లమెంటు ప్రజలకు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ దీపావళి శుభాకాంక్షలు.



ఏలూరు, నవంబర్ 07: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, ప్రతి ఇంటా సుఖసంతోషాలు, సిరిసంపదలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.చెడుపై మంచి సాధించిన విజయానికి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దీపావళి పండుగ ప్రతి ఒక్కరిలో సరికొత్త ఆశలు, సానుకూల ఆలోచనలు, నూతన ఉత్సాహాన్ని నింపాలని పేర్కొన్నారు. ప్రజల మధ్య ప్రేమాభిమానాలు, సోదరభావం, ఐక్యత మరింత బలపడాలని, సమాజంలో శాంతి, సామరస్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ తమ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి దీపావళి వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, పండుగ సంబరాల సమయంలో తగిన జాగ్రత్తలు పాటిస్తూ, పర్యావరణానికి మరియు ఇతరులకు ఇబ్బంది కలగకుండా సురక్షితంగా దీపావళిని జరుపుకోవాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్.

కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన డీఎస్పీ



జి మాడుగుల (మీ వార్త ప్రతినిధి) ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓట్ల కౌంటింగ్ నేపథ్యంలో పాడేరు డీఎస్పీ వి. రాజా సింహారెడ్డి శనివారం జి.మాడుగుల మండలంలోని కౌంటింగ్ కేంద్రాలను సందర్శించారు. ఓట్ల కౌంటింగ్ నిర్వహణకు సంబంధించి కేంద్రాల వద్ద పరిస్థితులను పరిశీలించారు. అనంతరం కౌంటింగ్ సిబ్బందితో మాట్లాడుతూ . ఓట్ల కౌంటింగ్ ప్రశాంత వాతావరణంలో జరిగేలా సిబ్బంది, ఏజెంట్లు, సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సాయిరాం పడాల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ప్రహరీ గోడ



జి మాడుగుల (మీ వార్త ప్రతినిధి) మండల కేంద్రంలో గల గవర్నమెంట్ హై స్కూల్ ప్రహరీ గోడ శనివారం కురిసిన వర్షానికి కూలిపోయింది. స్థానిక మండల కేంద్రంలో గల గవర్నమెంట్ హై స్కూల్ ప్రహరీ గోడ గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కు ప్రహరీ గోడ నానిపోవడం, ప్రహరీ నిర్మించి ఎన్నో ఏళ్లు కావడంతో శనివారం కురిసిన కొద్దిపాటి వర్షానికి రామాలయం వీధికి వెళ్లే ప్రధాన రహదారిపై ప్రహరీ గోడ కూలిపోయింది. ఇదే సమయంలో పాఠశాలలో విద్యార్థులు అటువైపు లేక పోవడం, మరియు రామాలయం వీధికి వెళ్లే ప్రధాన రహదారిపై వర్షం కారణంగా జనసంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

ఓట్ల లెక్కింపు,సమాచార ప్రక్రియలో అధికారుల నిర్లక్ష్య వైఖరి



జి మాడుగుల (మీ వార్త ప్రతినిధి) అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలంలో 1 జడ్పీటీసీ, 15 ఎంపీటీసీ , సెగ్మెంట్ స్థానాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియలో అధికారుల వ్యవహార శైలిపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ?ఓట్ల లెక్కింపు సమయంలో అధికారులు తీవ్ర సమయాభావం, నిర్లక్ష్యం ప్రదర్శించడం వల్ల ప్రక్రియ తీవ్రంగా ఆలస్యమైంది. జిల్లా కలెక్టర్ జారీ చేసిన స్పష్టమైన ఆదేశాలను సైతం లెక్కచేయకుండా, ఫలితాల వివరాలను మీడియాకు సమాచారం అందించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ?రాత్రి సమయం అవుతున్నా గెలిచిన అభ్యర్థుల వివరాలను అధికారికంగా ప్రకటించకపోవడం, సమాచార మార్పిడికి సహకరించకపోవడం అధికారుల బాధ్యతారాహిత్యాన్ని మరియు నిర్లక్ష్య ధోరణిని స్పష్టంగా తెలియజేస్తోంది. ఈ ఆలస్యం పట్ల స్థానిక అభ్యర్థులు, ప్రతినిధులు మీడియా వర్గాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.

గ్రామాల్లో కోతుల బెడద.. అడవులు తగ్గడమే కారణమా?

మనుషుల తప్పిదాలే వన్యప్రాణులకు శాపం..

ఆలోచించాల్సిన సమయం ఆసన్నం





కమ్మర్‌పల్లి : గ్రామాల్లో కోతుల బెడద రోజురోజుకూ పెరుగుతోంది. గుంపులు గుంపులుగా గ్రామాల్లోకి ప్రవేశిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తు న్నాయి. ఇళ్లపైకి ఎక్కి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడం, పండ్లు, కూరగాయల తోటలను ధ్వంసం చేయడం, రోడ్లపై సంచరిస్తూ వాహనదారులకు ఇబ్బందులు కలిగించడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి.అయితే కోతులు అడవులను వదిలి గ్రామాల బాట పట్టడానికి ప్రధాన కారణం ఏమిటి? ఒకసారి ఆలోచిస్తే సమాధానం మనుషుల దగ్గరే కనిపిస్తుంది. అభివృద్ధి పేరుతో అడవులను నరికివేయడం, చెట్లను తొలగించడం, అటవీ ప్రాంతాలను క్రమంగా తగ్గించడం వల్ల వన్యప్రాణుల సహజ ఆవాసాలు కనుమరుగవుతున్నాయి. అడవుల్లో ఆహారం, నీరు, ఆశ్రయం లభించకపోవడంతో కోతులు జనావాసాల వైపు వస్తున్నాయి. ఒకప్పుడు అడవుల్లో స్వేచ్ఛగా జీవించిన కోతులు నేడు గ్రామాల్లో ఆహారం కోసం వెతుక్కునే పరిస్థితి ఏర్పడింది. మనుషులు తమ అవసరాల కోసం ప్రకృతిని నాశనం చేస్తూ, ఇప్పుడు వన్యప్రాణులు గ్రామాల్లోకి వస్తున్నాయని వాటిని నిందించడం ఎంతవరకు సమంజసం?

తప్పు కోతులదా.. మనుషులదా?

ప్రకృతిలో ప్రతి జీవికి జీవించే హక్కు ఉంది. అడవులు వాటి నివాసాలు. వాటి ఆవాసాలను మనమే క్రమంగా తగ్గిస్తూ, వాటి మనుగడకు ఆటంకం కలిగిస్తున్నాం. అందుకే కోతుల సమస్యను కేవలం వన్యప్రాణుల ఇబ్బందిగా కాకుండా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటున్న సంకేతంగా గుర్తించాలి. ఇప్పటికైనా అడవుల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి. గ్రామాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలి, చెట్ల నరికివేతను అరికట్టాలి. కోతులకు ఆహారం వేయకుండా, చెత్తను బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. అటవీ శాఖ అధికారులు కూడా కోతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలి. అడవులను కాపాడితేనే వన్యప్రాణులు అడవుల్లో ఉంటాయి. ప్రకృతిని కాపాడుకోవడం మన బాధ్యత. కోతుల బెడదకు పరిష్కారం వాటిని నిందించడం కాదు.. వాటి ఆవాసాలను కాపాడటం!

క్యాసం పల్లిలో ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు మార్కింగ్

లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం..

గ్రామాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్న నూతన పాలకవర్గం





కామారెడ్డి : కామారెడ్డి మండలం క్యాసం పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఎంపికైన లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ముగ్గు మార్కింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్హులైన పేదలకు సొంతింటి కలను సాకారం చేయాలనే ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నారు. ఇందులో భాగంగా లబ్ధిదారుల ఇళ్ల స్థలాలను పరిశీలించి, నిర్మాణాలకు అనుగుణంగా ముగ్గు మార్కింగ్ వేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అడపా శ్యామ్ పాల్గొని ఇళ్ల నిర్మాణ ప్రక్రియను పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని, ఇళ్ల నిర్మాణాలను నిబంధనల ప్రకారం చేపట్టాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా గ్రామ పాలకవర్గం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతకు కృషి చేస్తామని పాలకవర్గ సభ్యులు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమవుతుండటంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, పాలకవర్గ సభ్యులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి చంద్రకళ, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

అధ్యక్షుడిగా బాన్సువాడ దినేష్ రెడ్డి

ప్రధాన కార్యదర్శిగా ఏనుగు సతీష్ రెడ్డి

జిల్లాలో హ్యాండ్‌బాల్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తాం



కామారెడ్డి : కామారెడ్డి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పవన్ కుమార్ అధ్వర్యంలో సదాశివనగర్ మండలం బొంపల్లి శివారులోని జీపీ గార్డెన్స్‌లో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం, ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు.ఈ ఎన్నికల్లో నూతన అధ్యక్షుడిగా బాన్సువాడ దినేష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఏనుగు సతీష్ రెడ్డి, కోశాధికారిగా బ్యాగరి లింగం ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎం. నరేష్ రెడ్డి, జె. మోహన్ రెడ్డి, కె. రాజవర్ధన్, రాజేందర్ రెడ్డి, స్వామి గౌడ్ ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీలుగా పి. సంజీవులు, ఎన్. రాజు, జి. మహేష్, జి. దయాకర్ రెడ్డిలను ఎంపిక చేశారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా కే. మహేష్, ఓ. నిఖిల్, డి. మహేష్, బి. శిరీష, కే. నాగరాజు, కే. వైష్ణవి, కే. ప్రశాంత్, మౌనిక, ప్రసాద్, బి. మహేష్, రితీష్ ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధి విజయ్ బాబు, కామారెడ్డి జిల్లా యువజన, క్రీడల అధికారి రంగ వెంకటేశ్వర్ గౌడ్, నిజామాబాద్ ఒలింపిక్ అసోసియేషన్ పరిశీలకులు జి.వి. భూమారెడ్డి వ్యవహరించగా, ఎన్నికల అధికారిగా అడ్వకేట్ లోకాలాల్ బాధ్యతలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం జిల్లాలో హ్యాండ్‌బాల్ క్రీడను మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేయాలని సంకల్పించింది. గ్రామీణ ప్రాంతాల్లోని బాలబాలికల్లో క్రీడలపై ఆసక్తి పెంపొందించడం, జిల్లా స్థాయి పోటీలు నిర్వహించడం, ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి రాష్ట్రస్థాయి పోటీలకు తీర్చిదిద్దడం లక్ష్యంగా పనిచేయనున్నట్లు ఆశాభావం వ్యక్తమైంది. నూతన కార్యవర్గానికి పలువురు క్రీడాభిమానులు, క్రీడాకారులు శు భాకాంక్షలు తెలిపారు. కామారెడ్డి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్

కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శిగా నరేష్ పీకే నియామకం

నియామక పత్రం అందజేసిన

మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా



ఎల్లారెడ్డి : కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి మండల ప్రధాన కార్యదర్శిగా అన్నాసాగర్ గ్రామానికి చెందిన యువ నాయకుడు నరేష్ పీకే నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు చేతుల మీదుగా ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని పార్టీ నాయకులు తెలిపారు.ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు నాయకత్వంలో పార్టీ బలోపేతానికి నరేష్ పీకే చేస్తున్న కృషిని గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కురుమ సాయిబాబా తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ప్రజాహిత కార్యక్రమాలు చేపడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా నరేష్ పీకే మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో మండల ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబాకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను అహర్నిశలు కష్టపడుతూ నిర్వర్తిస్తానని, పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు అట్కరి చంద్రయ్య, ఎరుకల దశరథం, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ నాగం గోపికృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆశమొల్ల సాయిబాబా, యూత్ అధ్యక్షుడు సంతోష్ నాయక్, సీనియర్ నాయకులు దుంపల శంకర్, శివానందం, యువ నాయకులు శ్రీనివాస్, కుచులకంటి శంకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఛాంపియన్‌గా నిలిచిన నిజామాబాద్ జట్టులో ప్రాతినిధ్యం వహించి స్వర్ణపతకం సాధించిన సత్యశోధక్ విద్యార్థిని నర్మల స్నితికా రెడ్డి.



హర్షం వ్యక్తం చేసిన సత్యశోధక పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్ :నర్సయ్య

సిరికొండ : సిరికొండ మండల కేంద్రంలోకి చెందిన సత్యశోధక్ పాఠశాల విద్యార్థిని నవంబర్ 04 నుంచి 06 వరకు సిద్ధిపేట జిల్లా గజ్వేల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలికల ప్రాంగణం (గర్ల్స్ ఎడ్యుకేషనల్ హబ్)లో తెలంగాణ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 70వ స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి అండర్-19 బాలికల సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో నిజామాబాద్ జిల్లా బాలికల జట్టు అద్భుత ప్రతిభ కనబరిచి ఛాంపియన్‌గా నిలిచింది. ఈ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన సత్యశోధక్ పాఠశాల విద్యార్థిని నర్మల స్నితికా రెడ్డి జట్టు విజయంలో భాగస్వామిగా స్వర్ణపతకం సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది. రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతగా నిలిచిన నిజామాబాద్ జిల్లా జట్టుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన సిద్ధిపేట జిల్లా గజ్వేల్ మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిచేటి చందన రవీందర్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీని అందజేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేత జట్టులో భాగస్వామిగా నిలిచిన స్నితికా రెడ్డిని పలువురు క్రీడాభిమానులు అభినందించారు. ఈ సందర్భంగా సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థిని నర్మల స్నితికా రెడ్డిని శనివారం పాఠశాలలో ప్రత్యేకంగా అభినందించారు. క్రీడల్లో నిరంతర సాధన, క్రమశిక్షణ, పట్టుదలతో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ఆసక్తి పెంపొందించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పాఠశాల విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యతనిస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొని స్నితికా రెడ్డిని అభినందించారు.

బాధిత కుటుంబానికి అండగా ఎస్ ఆర్ ఫౌండేషన్

లింగాయిపల్లిలో చెరువులో మునిగి తల్లీకూతుళ్ల మృతి..

కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



కామారెడ్డి : కామారెడ్డి మండలం లింగాయిపల్లి గ్రామంలో ఇటీవల చోటుచేసుకున్న విషాదకర ప్రమాదంలో సోమిశెట్టి మల్లేశం భార్య సోమిశెట్టి రజిత (40), ఆమె తండ్రి శంకరి పెద్ద నర్సయ్య (60) ప్రమాదవశాత్తు కోటాల్‌పల్లి చెరువులో నీట మునిగి మృతి చెందిన ఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంతో ఆ కుటుంబం తీవ్ర దుఃఖంలో మునిగిపోయింది.

ఈ కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు ఎస్ ఆర్ ఫౌండేషన్ ముందుకొచ్చి మానవతా దృక్పథంతో ఆర్థిక సహాయం అందించింది. మృతి చెందిన రజిత భర్త సోమిశెట్టి మల్లేశంను పరామర్శించి తక్షణ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాధలో ఉన్న కుటుంబానికి భరోసా కల్పిస్తూ తమ వంతు సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు జిల్లా గౌరవ అధ్యక్షులు మామిండ్ల అంజయ్య, మాజీ సర్పంచ్ కిషన్ గౌడ్, ఉప సర్పంచ్ సోమిశెట్టి రవి, తుజల్పూర్ మాజీ సర్పంచ్ చెల్లాపురం వెంకట్ గౌడ్, క్యాసంపల్లి తండా సర్పంచ్ భూక్యా శ్రీనునాయక్, హెచ్. శ్రీనివాస్ రెడ్డి (ఐస్‌క్రీం), ఏ. లక్ష్మణ్ గౌడ్, జి. భాస్కర్ రెడ్డి, పి. రాజ్‌గోపాల్ రెడ్డి, సోమిశెట్టి సాయిలు, సోమిశెట్టి దేవేందర్, వార్డు సభ్యుడు స్వామి, తోట మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఆపద సమయంలో ఆర్థిక సహాయం అందించిన ఎస్ ఆర్ ఫౌండేషన్ సభ్యులకు, సహకరించిన పెద్దలకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో బాధితులకు అండగా నిలవడమే నిజమైన మానవత్వమని ఈ సహాయ కార్యక్రమం చాటిచెప్పింది.

ఎండిపోయిన వరి పొలాల పరిశీలన

ఏఈఓ శిల్ప



కామారెడ్డి అన్నారం గ్రామంలో ఎల్నినో ప్రభావంతో భూగర్భ జలమట్టాలు తగ్గిపోవడంతో నీటి లభ్యత లేక ఎండిపోయిన వరి పొలాలను వ్యవసాయ విస్తరణ అధికారిని శిల్ప క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా పంట నష్టానికి గల కారణాలను పరిశీలించి, రైతుల నుంచి వివరాలు సేకరించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ దయానంద్ మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

బిజినెస్

దీపావళి బోనస్ వచ్చిందా? ఇలా చేస్తే బెస్ట్!





దీపావళి వస్తుందంటే ఉద్యోగుల్లో ఎక్కడ చూసినా బోనస్‌ల సందడి ఉంటుంది. పండుగ వేళ ఉద్యోగులకు వచ్చే బోనస్ అదనపు ఆనందాన్ని ఇస్తుంది. అయితే చేతికి అందిన ఆ మొత్తాన్ని ఎలా ఉపయోగించుకోవాలన్నది చాలామందికి ఎదురయ్యే ప్రశ్న. పండుగ షాపింగ్ కోసం ఖర్చు చేయాలా? అప్పులు తీర్చాలా? అత్యవసర అవసరాల కోసం పొదుపు చేయాలా? లేక పెట్టుబడులు పెట్టాలా? ఆర్థిక నిపుణుల సూచనల ప్రకారం.. బోనస్‌ను ఒకేసారి ఖర్చు చేయకుండా, ప్రస్తుత ఆర్థిక పరిస్థితి, అప్పులు, భవిష్యత్తు అవసరాలను బట్టి విభజించుకోవడం మంచిది.

బోనస్‌ను ఇలా విభజించుకోవచ్చు..

ఎయిర్‌పే మనీ సీఈఓ కుమార్ బినిత్ సూచించిన 20:30:30:20 విధానం ఒక ప్రాథమిక మార్గదర్శకంగా ఉపయోగపడుతుంది. దీని ప్రకారం బోనస్‌లో 20 శాతం పండుగ ఖర్చులకు, 30 శాతం అత్యవసర పొదుపులకు, మరో 30 శాతం అప్పుల చెల్లింపునకు, మిగిలిన 20 శాతం పెట్టుబడులకు కేటాయించవచ్చు. ఉదాహరణకు రూ.50,000 బోనస్ వస్తే.. రూ.10,000 పండుగ ఖర్చులకు, రూ.15,000 అత్యవసర నిధికి, రూ.15,000 అప్పుల చెల్లింపునకు, మరో రూ.10,000 పెట్టుబడులకు వినియోగించవచ్చు.

క్రెడిట్ కార్డు అప్పులుంటే తీర్చేయండి..

బోనస్‌తో పెట్టుబడులు పెట్టే ముందు క్రెడిట్ కార్డు బకాయిలు, అధిక వడ్డీ వ్యక్తిగత రుణాలు ఉంటే వాటిని తగ్గించుకోవడంపై దృష్టి పెట్టాలి. ఎందుకంటే ఈ రుణాలపై చెల్లించే వడ్డీ భారం ఎక్కువగా ఉంటుంది. మరోవైపు మ్యూచువల్ ఫండ్లు, షేర్లలో వచ్చే రాబడికి ఎలాంటి హామీ ఉండదు. కాబట్టి అధిక వడ్డీ అప్పులను కొనసాగిస్తూ పెట్టుబడులు పెట్టడం కంటే వాటిని ముందుగా క్లియర్ చేయడం ప్రయోజనకరం.

అత్యవసర నిధి తప్పనిసరి

అప్పులు తీర్చడంతోపాటు కనీసం మూడు నుంచి ఆరు నెలల కుటుంబ ఖర్చులకు సరిపడా అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవాలి. ఉదాహరణకు నెలకు రూ.40,000 ఖర్చు చేసే వ్యక్తి రూ.1.2 లక్షల నుంచి రూ.2.4 లక్షల వరకు అత్యవసర నిధిగా సమకూర్చుకోవాలి. ఉద్యోగ భద్రత తక్కువగా ఉన్నవారు, కుటుంబ బాధ్యతలు ఎక్కువగా ఉన్నవారు మరింత మొత్తాన్ని కేటాయించుకోవచ్చు. ఈ డబ్బును సులభంగా ఉపసంహరించుకునే పొదుపు ఖాతా లేదా తగిన ఇతర సురక్షిత మార్గాల్లో ఉంచాలి.

పెట్టుబడులు పెట్టేటప్పుడు జాగ్రత్త

అత్యవసర అవసరాలకు సరిపడా డబ్బు పక్కన పెట్టిన తర్వాతే మిగిలిన మొత్తాన్ని పెట్టుబడులకు మళ్లించాలి. స్వల్పకాలిక అవసరాలున్నవారు తక్కువ వ్యవధి డెట్ ఫండ్లను పరిశీలించవచ్చు. దీర్ఘకాలిక లక్ష్యాలున్నవారు తమ రిస్క్ సామర్థ్యం, పెట్టుబడి వ్యవధిని బట్టి ఇతర పథకాలను ఎంచుకోవచ్చు. అయితే డెట్ మ్యూచువల్ ఫండ్లు కూడా ఫిక్స్‌డ్ డిపాజిట్లు కావు. వాటి రాబడికి హామీ ఉండదు. వడ్డీ రేట్లు, క్రెడిట్ రిస్క్ కారణంగా పెట్టుబడి విలువలో మార్పులు రావచ్చు. దీపావళి వస్తుందంటే ఉద్యోగుల్లో ఎక్కడ చూసినా బోనస్‌ల సందడి ఉంటుంది. పండుగ వేళ ఉద్యోగులకు వచ్చే బోనస్ అదనపు ఆనందాన్ని ఇస్తుంది. అయితే చేతికి అందిన ఆ మొత్తాన్ని ఎలా ఉపయోగించుకోవాలన్నది చాలామందికి ఎదురయ్యే ప్రశ్న. పండుగ షాపింగ్ కోసం ఖర్చు చేయాలా? అప్పులు తీర్చాలా? అత్యవసర అవసరాల కోసం పొదుపు చేయాలా? లేక పెట్టుబడులు పెట్టాలా? ఆర్థిక నిపుణుల సూచనల ప్రకారం.. బోనస్‌ను ఒకేసారి ఖర్చు చేయకుండా, ప్రస్తుత ఆర్థిక పరిస్థితి, అప్పులు, భవిష్యత్తు అవసరాలను బట్టి విభజించుకోవడం మంచిది.

బోనస్‌ను ఇలా విభజించుకోవచ్చు..

ఎయిర్‌పే మనీ సీఈఓ కుమార్ బినిత్ సూచించిన 20:30:30:20 విధానం ఒక ప్రాథమిక మార్గదర్శకంగా ఉపయోగపడుతుంది. దీని ప్రకారం బోనస్‌లో 20 శాతం పండుగ ఖర్చులకు, 30 శాతం అత్యవసర పొదుపులకు, మరో 30 శాతం అప్పుల చెల్లింపునకు, మిగిలిన 20 శాతం పెట్టుబడులకు కేటాయించవచ్చు. ఉదాహరణకు రూ.50,000 బోనస్ వస్తే.. రూ.10,000 పండుగ ఖర్చులకు, రూ.15,000 అత్యవసర నిధికి, రూ.15,000 అప్పుల చెల్లింపునకు, మరో రూ.10,000 పెట్టుబడులకు వినియోగించవచ్చు.

క్రెడిట్ కార్డు అప్పులుంటే తీర్చేయండి..

బోనస్‌తో పెట్టుబడులు పెట్టే ముందు క్రెడిట్ కార్డు బకాయిలు, అధిక వడ్డీ వ్యక్తిగత రుణాలు ఉంటే వాటిని తగ్గించుకోవడంపై దృష్టి పెట్టాలి. ఎందుకంటే ఈ రుణాలపై చెల్లించే వడ్డీ భారం ఎక్కువగా ఉంటుంది. మరోవైపు మ్యూచువల్ ఫండ్లు, షేర్లలో వచ్చే రాబడికి ఎలాంటి హామీ ఉండదు. కాబట్టి అధిక వడ్డీ అప్పులను కొనసాగిస్తూ పెట్టుబడులు పెట్టడం కంటే వాటిని ముందుగా క్లియర్ చేయడం ప్రయోజనకరం.

అత్యవసర నిధి తప్పనిసరి

అప్పులు తీర్చడంతోపాటు కనీసం మూడు నుంచి ఆరు నెలల కుటుంబ ఖర్చులకు సరిపడా అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవాలి. ఉదాహరణకు నెలకు రూ.40,000 ఖర్చు చేసే వ్యక్తి రూ.1.2 లక్షల నుంచి రూ.2.4 లక్షల వరకు అత్యవసర నిధిగా సమకూర్చుకోవాలి. ఉద్యోగ భద్రత తక్కువగా ఉన్నవారు, కుటుంబ బాధ్యతలు ఎక్కువగా ఉన్నవారు మరింత మొత్తాన్ని కేటాయించుకోవచ్చు. ఈ డబ్బును సులభంగా ఉపసంహరించుకునే పొదుపు ఖాతా లేదా తగిన ఇతర సురక్షిత మార్గాల్లో ఉంచాలి.

పెట్టుబడులు పెట్టేటప్పుడు జాగ్రత్త

అత్యవసర అవసరాలకు సరిపడా డబ్బు పక్కన పెట్టిన తర్వాతే మిగిలిన మొత్తాన్ని పెట్టుబడులకు మళ్లించాలి. స్వల్పకాలిక అవసరాలున్నవారు తక్కువ వ్యవధి డెట్ ఫండ్లను పరిశీలించవచ్చు. దీర్ఘకాలిక లక్ష్యాలున్నవారు తమ రిస్క్ సామర్థ్యం, పెట్టుబడి వ్యవధిని బట్టి ఇతర పథకాలను ఎంచుకోవచ్చు. అయితే డెట్ మ్యూచువల్ ఫండ్లు కూడా ఫిక్స్‌డ్ డిపాజిట్లు కావు. వాటి రాబడికి హామీ ఉండదు. వడ్డీ రేట్లు, క్రెడిట్ రిస్క్ కారణంగా పెట్టుబడి విలువలో మార్పులు రావచ్చు. దీపావళి వస్తుందంటే ఉద్యోగుల్లో ఎక్కడ చూసినా బోనస్‌ల సందడి ఉంటుంది. పండుగ వేళ ఉద్యోగులకు వచ్చే బోనస్ అదనపు ఆనందాన్ని ఇస్తుంది. అయితే చేతికి అందిన ఆ మొత్తాన్ని ఎలా ఉపయోగించుకోవాలన్నది చాలామందికి ఎదురయ్యే ప్రశ్న. పండుగ షాపింగ్ కోసం ఖర్చు చేయాలా? అప్పులు తీర్చాలా? అత్యవసర అవసరాల కోసం పొదుపు చేయాలా? లేక పెట్టుబడులు పెట్టాలా? ఆర్థిక నిపుణుల సూచనల ప్రకారం.. బోనస్‌ను ఒకేసారి ఖర్చు చేయకుండా, ప్రస్తుత ఆర్థిక పరిస్థితి, అప్పులు, భవిష్యత్తు అవసరాలను బట్టి విభజించుకోవడం మంచిది.

బోనస్‌ను ఇలా విభజించుకోవచ్చు..

ఎయిర్‌పే మనీ సీఈఓ కుమార్ బినిత్ సూచించిన 20:30:30:20 విధానం ఒక ప్రాథమిక మార్గదర్శకంగా ఉపయోగపడుతుంది. దీని ప్రకారం బోనస్‌లో 20 శాతం పండుగ ఖర్చులకు, 30 శాతం అత్యవసర పొదుపులకు, మరో 30 శాతం అప్పుల చెల్లింపునకు, మిగిలిన 20 శాతం పెట్టుబడులకు కేటాయించవచ్చు. ఉదాహరణకు రూ.50,000 బోనస్ వస్తే.. రూ.10,000 పండుగ ఖర్చులకు, రూ.15,000 అత్యవసర నిధికి, రూ.15,000 అప్పుల చెల్లింపునకు, మరో రూ.10,000 పెట్టుబడులకు వినియోగించవచ్చు.

క్రెడిట్ కార్డు అప్పులుంటే తీర్చేయండి..

బోనస్‌తో పెట్టుబడులు పెట్టే ముందు క్రెడిట్ కార్డు బకాయిలు, అధిక వడ్డీ వ్యక్తిగత రుణాలు ఉంటే వాటిని తగ్గించుకోవడంపై దృష్టి పెట్టాలి. ఎందుకంటే ఈ రుణాలపై చెల్లించే వడ్డీ భారం ఎక్కువగా ఉంటుంది. మరోవైపు మ్యూచువల్ ఫండ్లు, షేర్లలో వచ్చే రాబడికి ఎలాంటి హామీ ఉండదు. కాబట్టి అధిక వడ్డీ అప్పులను కొనసాగిస్తూ పెట్టుబడులు పెట్టడం కంటే వాటిని ముందుగా క్లియర్ చేయడం ప్రయోజనకరం.

అత్యవసర నిధి తప్పనిసరి

అప్పులు తీర్చడంతోపాటు కనీసం మూడు నుంచి ఆరు నెలల కుటుంబ ఖర్చులకు సరిపడా అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవాలి. ఉదాహరణకు నెలకు రూ.40,000 ఖర్చు చేసే వ్యక్తి రూ.1.2 లక్షల నుంచి రూ.2.4 లక్షల వరకు అత్యవసర నిధిగా సమకూర్చుకోవాలి. ఉద్యోగ భద్రత తక్కువగా ఉన్నవారు, కుటుంబ బాధ్యతలు ఎక్కువగా ఉన్నవారు మరింత మొత్తాన్ని కేటాయించుకోవచ్చు. ఈ డబ్బును సులభంగా ఉపసంహరించుకునే పొదుపు ఖాతా లేదా తగిన ఇతర సురక్షిత మార్గాల్లో ఉంచాలి.

పెట్టుబడులు పెట్టేటప్పుడు జాగ్రత్త

అత్యవసర అవసరాలకు సరిపడా డబ్బు పక్కన పెట్టిన తర్వాతే మిగిలిన మొత్తాన్ని పెట్టుబడులకు మళ్లించాలి. స్వల్పకాలిక అవసరాలున్నవారు తక్కువ వ్యవధి డెట్ ఫండ్లను పరిశీలించవచ్చు. దీర్ఘకాలిక లక్ష్యాలున్నవారు తమ రిస్క్ సామర్థ్యం, పెట్టుబడి వ్యవధిని బట్టి ఇతర పథకాలను ఎంచుకోవచ్చు. అయితే డెట్ మ్యూచువల్ ఫండ్లు కూడా ఫిక్స్‌డ్ డిపాజిట్లు కావు. వాటి రాబడికి హామీ ఉండదు. వడ్డీ రేట్లు, క్రెడిట్ రిస్క్ కారణంగా పెట్టుబడి విలువలో మార్పులు రావచ్చు.

రుణాలు లేనివారికి మరింత వెసులుబాటు

ఇప్పటికే అప్పులు తీర్చేసి, తగినంత అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకున్నవారు తమ బోనస్‌లో ఎక్కువ మొత్తాన్ని దీర్ఘకాలిక పెట్టుబడులకు లేదా భవిష్యత్తు లక్ష్యాలకు కేటాయించవచ్చు. అవసరమైతే పండుగ వేడుకలు, షాపింగ్ కోసం కొంత ఎక్కువ ఖర్చు చేయవచ్చు. మొత్తంగా చెప్పాలంటే.. దీపావళి బోనస్‌ను పూర్తిగా ఖర్చు చేయడం లేదా మొత్తం పెట్టుబడి పెట్టడం రెండూ సరైన నిర్ణయాలు కాకపోవచ్చు. అప్పుల భారం, పొదుపులు, కుటుంబ అవసరాలను బట్టి ప్రణాళిక రూపొందించుకోవాలి.

బంగారం కొంటున్నారా? తస్మాత్ జాగ్రత్త..
యాసిడ్ పరీక్షలోనూ దొరకని కొత్త కల్తీ!



న్యూఢిల్లీ: బంగారం కొనుగోలుదారులు, నగల వ్యాపారులను ఆందోళనకు గురిచేస్తున్న కొత్త తరహా కల్తీ దందా వెలుగులోకి వచ్చింది. బంగారంలో రుథేనియం, ఇరిడియం, ఓస్మియం వంటి భార లోహాల సన్నని పొడిని కలిపి దాని బరువును కృత్రిమంగా పెంచుతున్నారు. ఈ కల్తీ బంగారం అసలైన బంగారంలా ఉండటమే కాకుండా సాధారణంగా చేసే యాసిడ్ పరీక్ష, టచ్‌స్టోన్(గీటురాయి) పరీక్షల్లోనూ దొరుకడం లేదు. నగలను తయారు చేసేందుకు బంగారాన్ని కరిగించినప్పుడు మాత్రమే అసలు మోసం బయటపడుతున్నది. ఈ కొత్త తరహా కల్తీని మార్కెట్లో 'గోల్డ్ పౌడర్'గా పిలుస్తున్నట్టు వ్యాపార వర్గాలు చెప్తున్నాయి. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ సరాఫా మార్కెట్లో పనిచేస్తున్న పలువురు నగల తయారీ కళాకారులు బంగారం నాణ్యతపై అనుమానాలు వ్యక్తం చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో ఇండోర్ సిల్వర్, గోల్డ్ అండ్ జ్యువెలరీ ట్రేడర్స్ అసోసియేషన్ అత్యవసర సమావేశం నిర్వహించింది. బులియన్ వ్యాపారులు, మధ్యవర్తులు బంగారం కొనుగోలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించింది. 99.50 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం వ్యాపారానికే ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్టు స్థానిక వ్యాపారవర్గాలు తెలిపాయి.

మూడేండ్లుగా భారీ లోహాల కల్తీ ఫిర్యాదులు

రుథేనియం, ఇరిడియం, ఓస్మియం వంటి లోహాలను బంగారంలో కలుపుతున్నారన్న ఫిర్యాదులు గత రెండు మూడేండ్లుగా వస్తున్నాయని వ్యాపారులు చెప్తున్నారు. వీటి సాంద్రత ఎక్కువగా ఉండటంతో తక్కువ పరిమాణంలో కలిపినా బంగారం మొత్తం బరువు పెరుగుతుంది. మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్ మార్గాల ద్వారా ఈ కల్తీ పదార్థాలు భారత మార్కెట్లకు చేరుతున్నట్టు అనుమానిస్తున్నారు. వీటిని చైనాలో తయారు చేస్తున్నారన్న సందేహాలు కూడా ఉన్నప్పటికీ, వాటి మూలాలపై స్వతంత్రంగా నిర్ధారణ కాలేదు. సాధారణ యాసిడ్, గీటురాయి పరీక్షలతో పాటు పాతతరహా క్యారెట్ పరీక్షా యంత్రాలు కూడా ఈ కల్తీని గుర్తించడంలో విఫలమవుతున్నట్టు వ్యాపారులు చెప్తున్నారు. ఎక్స్‌రే ఫ్లోరోసెన్స్ (ఎక్స్‌ఆర్‌ఎఫ్) పరీక్షలు, ఎలక్ట్రాన్ మైక్రోస్కోపీ వంటి ఆధునిక సాంకేతిక పద్ధతులతో బంగారంలోని ఇతర లోహాల ఉనికిని గుర్తించే అవకాశం ఉన్నది. అందువల్ల బంగారం కొనుగోలు, విక్రయాల్లో నాణ్యతా పరీక్షలను మరింత పటిష్ఠం చేయాల్సిన అవసరం ఏర్పడింది.

వినియోగదారులు ఏం చేయాలి?

బీఐఎస్ హాల్‌మార్క్ , ఆరు అంకెల గుర్తింపు సంఖ్య ఉన్న నగలనే కొనుగోలు చేయాలి.
బీఐఎస్ కేర్ యాప్‌లో నంబరును నమోదు చేసి నగ వివరాలు, ప్రకటించిన స్వచ్ఛతను పరిశీలించాలి.
నమ్మకమైన నగల దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి.
కొనుగోలు బిల్లును తప్పనిసరిగా తీసుకోవాలి.
అనుమానం ఉంటే పరీక్షా కేంద్రంలో నాణ్యతను పరీక్షించాలి.

స్పోర్ట్స్

కివీస్ ఆశలపై వర్షం నీళ్లు..

డీఎల్ఎస్‌తో భారత్‌కు సిరీస్‌లో రెండో విజయం!

న్యూజిలాండ్‌పై భారత్‌కు 4 పరుగుల తేడాతో విజయం
డీఎల్ఎస్ పద్ధతిలో ఫలితం తేల్చిన వర్షం
కివీస్‌ను 134 పరుగులకే కట్టడి చేసిన భారత బౌలర్లు
గుర్నూర్ బ్రార్ నాలుగు వికెట్లతో మెరుపు ప్రదర్శన
ఐదు వన్డేల సిరీస్‌లో 2-0తో ఆధిక్యంలో భారత్

వర్షం.. వికెట్ల పతనం.. ఉత్కంఠభరిత పోరు! చివరకు డక్‌వర్త్ లూయిస్ (డీఎల్ఎస్) పద్ధతిలో భారత్ విజయం సాధించింది. న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్‌లో శనివారం జరిగిన రెండో వన్డేలో టీమిండియా 4 పరుగుల తేడాతో గెలిచింది. దీంతో ఐదు వన్డేల సిరీస్‌లో 2-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. తొలుత భారత బౌలర్లు అదరగొట్టి కివీస్‌ను 134 పరుగులకే కట్టడి చేశారు. లక్ష్య ఛేదనలో భారత బ్యాటర్లు తడబడినా.. చివర్లో వర్షం రావడంతో డీఎల్ఎస్ పద్ధతి భారత్‌కు విజయాన్ని అందించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్‌ను భారత పేసర్లు ఆరంభంలోనే దెబ్బతీశారు. అఖిబ్ నబీ రెండు వికెట్లు తీసి కివీస్‌ను ఒత్తిడిలోకి నెట్టాడు. అన్షుల్ కాంబోజ్ కూడా రెండు వికెట్లు పడగొట్టాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా డారిల్ మిచెల్ మాత్రం పట్టుదలగా ఆడాడు. 104 బంతుల్లో 55 పరుగులు చేసి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించే ప్రయత్నం చేశాడు. గ్లెన్ ఫిలిప్స్, టామ్ లాథమ్ ఎక్కువసేపు నిలవలేకపోయారు. కెప్టెన్ మిచెల్ సాంట్నర్ 31 పరుగులతో రాణించాడు. చివరకు 41 ఓవర్లలో కివీస్ 134 పరుగులకు ఆలౌటైంది. గుర్నూర్ బ్రార్ నాలుగు వికెట్లతో



సత్తాచాటగా.. అఖిబ్ నబీ, అన్షుల్ కాంబోజ్, అక్షర్ పటేల్ రెండేసి వికెట్లు తీశారు. స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆదిలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ గోల్డెన్ డక్‌గా వెనుదిరగగా.. విరాట్ కోహ్లీ 7 పరుగులకే ఔటయ్యాడు. రోహిత్ శర్మ 23, శ్రేయస్ అయ్యర్ 30 పరుగులు చేసి ఆదుకునే ప్రయత్నం చేశారు. అయితే క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోవడంతో భారత్ కష్టాల్లో పడింది. కేఎల్ రాహుల్ 26 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. 26 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసిన సమయంలో వర్షం మొదలైంది. ఎంతసేపటికీ ఆట తిరిగి ప్రారంభం కాకపోవడంతో మ్యాచ్‌ను రద్దు చేశారు. డీఎల్ఎస్ లెక్కల ప్రకారం భారత్ 4 పరుగుల తేడాతో విజేతగా నిలిచింది. చివరి వరకు పోరాడిన కివీస్‌కు నిరాశే ఎదురైంది.

కివీస్‌పై 'కింగ్' కోహ్లీ..
పాంటింగ్ ప్రపంచ రికార్డు బద్ధలు!



టీమిండియా స్టార్ బ్యాటర్, రన్ మెషీన్ విరాట్ కోహ్లీ మరో ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. వెల్లింగ్టన్‌లోని సెల్లో బేసిన్ రిజర్వ్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన రెండో వన్డేలో, ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్‌ను అధిగమించి కివీస్‌పై వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. ఈ మ్యాచ్‌లో 135 పరుగుల లక్ష్య ఛేదనలో కోహ్లీ 7 పరుగులు మాత్రమే చేసినప్పటికీ, ఈ అరుదైన ఘనతను అందుకున్నాడు. ఈ మ్యాచ్ ప్రారంభానికి ముందు కోహ్లీ, పాంటింగ్ ఇద్దరూ న్యూజిలాండ్‌పై 1,971 పరుగులతో సమంగా ఉన్నారు. తాను ఎదుర్కొన్న రెండో బంతికే బౌండరీ బాదిన కోహ్లీ, పాంటింగ్‌ను వెనక్కి నెట్టి అగ్రస్థానానికి దూసుకెళ్లాడు. ఆస్ట్రేలియా దిగ్గజం రికీ పాంటింగ్ ఈ మైలురాయిని 51 మ్యాచ్‌ల్లోని 50 ఇన్నింగ్స్‌లలో చేరుకోగా, విరాట్ కోహ్లీ కేవలం 38 ఇన్నింగ్స్‌లలోనే ఈ ఘనత సాధించడం విశేషం. పాంటింగ్ కివీస్‌పై 45.83 సగటుతో 6 సెంచరీలు, 12 అర్ధ సెంచరీలు నమోదు చేశాడు. ప్రస్తుతం కోహ్లీ 1,978 పరుగులతో ఈ జాబితాలో మొదటి స్థానంలో ఉన్నాడు. ఈ సిరీస్‌లో ఇంకా మూడు మ్యాచ్‌లు మిగిలి ఉన్న నేపథ్యంలో న్యూజిలాండ్‌పై 2,000 వన్డే పరుగులు పూర్తి చేసిన తొలి ఆటగాడిగా నిలిచే సువర్ణావకాశం కోహ్లీ ముందుంది. కివీస్‌పై అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో కోహ్లీ, పాంటింగ్ తర్వాత సచిన్ టెండూల్కర్ (1,750), కుమార్ సంగక్కర (1,568), సనత్ జయసూర్య (1,519) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. కాగా, ఈ మ్యాచ్‌లో కోహ్లీ ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు.

రెండో వన్డేలో బ్యాటర్ల కష్టాలు..
పిచ్‌పై కివీస్ స్టార్ బ్యాటర్ ఆసక్తికర వ్యాఖ్యలు



భారత్‌తో రెండో వన్డేలో న్యూజిలాండ్ బ్యాటర్లు పరుగులు చేయడానికి తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. వెల్లింగ్టన్ పిచ్‌పై బంతి అనూహ్యంగా బౌన్స్ అవుతోందని కివీస్ బ్యాటర్ డారిల్ మిచెల్ తెలిపాడు. ఎప్పుడు ఎంత ఎత్తులో వస్తుందో అంచనా వేయలేకపోయామని చెప్పాడు. ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ 134 పరుగులకే కుప్పకూలింది. రెండో ఇన్నింగ్స్‌లో భారత బ్యాటర్లు సైతం ఆచితూచి ఆడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పరిస్థితులకు తగ్గట్టుగా ఆడేందుకు ప్రయత్నించామని, అయినా ఆశించిన స్కోరు సాధించలేకపోయామని మ్యాచ్ అనంతరం బ్రాడ్‌కాస్టర్లతో మాట్లాడుతూ మిచెల్ వివరించాడు. పరుగులు చేయడానికి గ్యాప్‌లు వెతకడం, సింగిల్స్ తీయడం కూడా కష్టంగా మారిందని మిచెల్ తెలిపాడు. డ్రాప్ ఇన్ పిచ్ కావడంతో బంతి బ్యాట్‌కు తగిలిన తర్వాత వేగంగా ఫీల్డర్లను దాటడం లేదని చెప్పాడు. దీంతో స్ట్రైక్ రొటేట్ చేయడం మరింత కష్టమైందని వివరించాడు. న్యూజిలాండ్ 53 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన సమయంలో మిచెల్, శాంట్నర్ జట్టును ఆదుకున్నారు. ఆరో వికెట్‌కు 59 పరుగులు జోడించారు. మిచెల్ 104 బంతుల్లో 55 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అయితే కీలక భాగస్వామ్యాలు నెలకొల్పిన ప్రతిసారీ వికెట్లు కోల్పోవడం జట్టుకు ఇబ్బందిగా మారిందని చెప్పాడు. 134 పరుగుల లక్ష్యం తక్కువేనని మిచెల్ అంగీకరించాడు. అయినప్పటికీ భారత బ్యాటింగ్ ఆర్డర్‌లో తొలి వికెట్లు త్వరగా పడగొడితే మ్యాచ్‌లో అవకాశాలు ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేశాడు. మిడిల్ ఆర్డర్‌ను ఒత్తిడిలోకి నెట్టగలిగితే ఏదైనా జరగొచ్చని పేర్కొన్నాడు.



తొలిసారి కాబోయే భార్యతో సాయి దుర్గాతేజ్.. మెగా హీరో పోస్ట్ వైరల్

మెగా కుటుంబంలో పెళ్లి సందడి మొదలైంది. చిరంజీవి మేనల్లుడు, హీరో సాయిదుర్గా తేజ్ కిరణ్ నిశ్చితార్థం ఘనంగా జరిగింది. నవంబరు 5న హైదరాబాద్‌లోని హిల్టన్ హైదరాబాద్ జీనోమ్ వ్యాలీ రిసార్ట్‌లో కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ వేడుకను నిర్వహించారు. కొణిదెల, అల్లు కుటుంబ సభ్యులు ఈ వేడుకకు హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. మెగాస్టార్ చిరంజీవి, సురేఖ కొణిదెల, రామ్‌చరణ్, అల్లు అర్జున్, స్నేహారెడ్డి, అల్లు బాబీ, నీలా షా, వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠి, వారి కుమారుడు వాయువ్ తేజ్ ఈ వేడుకలో పాల్గొన్నారు. ఎంగేజ్‌మెంట్‌కు సంబంధించిన ఫోటోలను రామ్ చరణ్‌తో పాటు మెగా హీరోలంతా సోషల్ మీడియాలో షేర్ చేయడంతో వీరి పెళ్లి విషయం బయటకు తెలిసింది. అయితే సాయిదుర్గా తేజ్ మాత్రం నిశ్చితార్థం రోజు ఎలాంటి ఫోటోలను షేర్ చేయలేదు. దీంతో ఆయన కాబోయే భార్యను ఎలా పరిచయం చేస్తాడా అనే ఆసక్తి మెగా అభిమానుల్లో నెలకొంది. ఎట్టకేలకు నేడు తన ప్రేమ, పెళ్లి విషయాన్ని అధికారికంగా తెలియజేస్తూ.. 'ఐ లవ్ యూ' అంటూ ఎంగేజ్‌మెంట్‌లో కిరణ్‌తో కలిసి దిగిన ఫోటోని షేర్ చేశాడు. ఇలా సింపుల్ ప్రేమలేఖతో తన ప్రేమ, పెళ్లి విషయాన్ని అధికారికంగా ప్రకటించాడు. కాగా, కిరణ్, సాయిదుర్గా తేజ్ కొన్నాళ్లుగా ప్రేమలో ఉన్నారు. వీరిద్దరి చిన్నప్పటి నుంచి పరిచయం ఉంది. మొదట్లో స్నేహితులుగా ఉన్న వీరిద్దరు..కొన్నాళ్ల తర్వాత ప్రేమలో పడ్డారు. పెద్దల అంగీకారంతో ఇప్పుడు పెళ్లికి సిద్ధమైనట్లు తెలుస్తోంది.

పెళ్లి డేట్ ఫిక్స్..

ఎంగేజ్‌మెంట్ తర్వాత సాయిదుర్గా తేజ్ పెళ్లి డేట్‌పై సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వచ్చాయి. తాజాగా పెళ్లి డేట్‌ని అధికారికంగా ప్రకటిస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. డిసెంబర్ 10న హైదరాబాద్‌లో వీరి వివాహం జరగనుంది. ఈ వేడుకకి మెగా ఫ్యామిలీతో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరుకానున్నారు.



ఏడేళ్ల తర్వాత తమిళంలో నటిస్తున్నా.. 'ఓం' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మమ్ముట్టి!

మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి శుక్రవారం జరిగిన 'ఓం' ప్రీ-రిలీజ్ వేడుకలో తనదైన శైలిలో మాట్లాడి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన సినిమా విశేషాలను పంచుకుంటూ సరదాగా, అదే సమయంలో ఆసక్తికరంగా చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'పేరన్బు' చిత్రం తర్వాత సరిగ్గా ఏడేళ్లకు తాను మళ్లీ ఒక తమిళ సినిమా చేస్తున్నానని మమ్ముట్టి తెలిపారు. ఆ సినిమా తర్వాత మరిన్ని మంచి తమిళ ప్రాజెక్ట్‌లు చేయాలని చాలా మందిని అడిగానని, కానీ ఎవరూ తనను పట్టించుకోలేదంటూ ఆయన చమత్కరించారు. అయితే, ఈ 'ఓం' సినిమా మాత్రం తన కెరీర్‌లో ఎంతో ప్రత్యేకంగా, గుర్తుండిపోయేలా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇక తన సినీ ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ.. సూపర్‌స్టార్ రజనీకాంత్, ధనుష్ వంటి దిగ్గజ నటులతో కలిసి పనిచేసిన అనుభవాన్ని పంచుకున్నారు. "ఇప్పుడు నా పక్కనే ధనుష్ కొడుకు ఉన్నాడు, వాడు ఎప్పుడు సినిమాల్లోకి వచ్చి నటిస్తాడో నాకైతే తెలియదు" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు సభలో నవ్వులు పూయించాయి. ఈ చిత్ర కథాంశం గురించి మాట్లాడుతూ.. ఇందులో ఎన్నో వైవిధ్యమైన భావోద్వేగాలు ఉన్నాయని తెలిపారు. సామాన్య ప్రజల జీవితాలతో ముడిపడిన కొండ ప్రాంతపు నేపథ్యం, సాయిపల్లవి పాత్ర, ధనుష్ పాత్ర.. ఇలా ఎన్నో కథలు ఈ చిత్రంలో ఉన్నాయని, అయితే సినిమా కథను మాత్రం తాను ఇప్పుడే పూర్తిగా రివీల్ చేయబోనని స్పష్టం చేశారు. షూటింగ్ అనుభవాలను వివరిస్తూ.. ఈ సినిమా షూటింగ్ కేవలం 45 రోజుల్లో పూర్తవుతుందని మొదట్లో తనకు చెప్పారని, కానీ అది కాస్తా ఆరు నెలలకు పైగా సాగిందని చెప్పారు. ఇందులో స్మగ్లర్ నేపథ్యంలో సాగే ఘట్టాలు ఉండటంతో చాలా వరకు రాత్రిపూటే షూటింగ్ చేయాల్సి వచ్చిందని సరదాగా గుర్తుచేసుకున్నారు. తన ప్రసంగం ఎప్పుడూ సరదాగా నవ్వులు పంచేలా ఉంటుందని, కానీ ఈ సినిమా మాత్రం అందుకు పూర్తిగా భిన్నంగా ఎంతో సీరియస్‌గా ఉంటుందని మమ్ముట్టి తెలిపారు.

2026లోనూ నో రిలీజ్.. మరి ఇంకెప్పుడు?



తెలుగులో చాలామంది హీరోలున్నారు. వీళ్లలో స్టార్ హీరోలని పక్కనబెడితే కొందరు మిడ్ రేంజ్ హీరోలకు ప్రేక్షకుల్లో మంచి ఆదరణే ఉంది. కానీ అందుకు తగ్గట్లు వాళ్లు సినిమాలు తీయట్లేదు. తీసినా సరే అవి థియేటర్లలో రిలీజ్ కావట్లేదు. అలాంటి ఓ చిత్రమే 'స్వయంభు'. నిఖిల్ హీరో. ఇంతకీ ఈ మూవీ ఏమైంది? రిలీజ్ చేస్తారా చేయరా? స్వామి రారా, కార్తికేయ, ఎక్కడిపోతావు చిన్నవాడ సినిమాలతో హిట్స్ కొట్టిన నిఖిల్.. 'కార్తికేయ 2'తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నాడు. ఈ క్రమంలోనే 'స్వయంభు' అనే పాన్ ఇండియా సినిమాని మూడునాలుగేళ్ల క్రితం ప్రకటించాడు. 2023 ఆగస్టులోనే దీని షూటింగ్ మొదలైంది. ఇప్పటికి మూడేళ్లు గడిచిపోయాయి గానీ సదరు చిత్రం రిలీజ్ జాడలేకుండా పోయింది. ఎప్పుడు థియేటర్లలోకి వస్తుందో తెలియని పరిస్థితి. ఈ ఏడాది ఫిబ్రవరిలో శివరాత్రికే 'స్వయంభు' రిలీజ్ చేసేస్తామని ప్రమోషన్లతో టీమ్ హడావుడి చేశారు. టీవీ షోల్లో పాల్గొని, పలు ఇంటర్వ్యూలు ఇచ్చారు. కానీ వాయిదా పడింది. వేసవికి వచ్చేస్తామని అన్నారు కానీ అదీ జరగలేదు. తర్వాత నుంచి టీమ్ సైలెంట్ అయిపోయింది. ఇప్పుడు నవంబరు నెల. మరో 50 రోజుల్లో 2026 పూర్తవుతుంది. ప్రాక్టికల్‌గా చూస్తే ఈ ఏడాదిలో రిలీజ్ అసాధ్యం. పోనీ వచ్చే ఏడాది వద్దామనుకుంటే సంక్రాంతి సీజన్ ఇప్పటికే ఫుల్ అయిపోయింది. ఫిబ్రవరి, మార్చి, ఆపై వేసవి బెర్తులు నిండిపోతున్నాయి. మరి 'స్వయంభు' ఎప్పుడొస్తుందో ఏంటో?

'కార్తికేయ 2' హిట్ కాకముందు వరకు నిఖిల్ చేసిన సినిమాలు తెలుగులోనే రిలీజ్ అయ్యేవి. ఎప్పుడైతే ఈ పాన్ ఇండియా గోలలో పడ్డాడో అప్పటినుంచి రెగ్యులర్‌గా కనిపించకుండాపోయాడు. సాధారణ ప్రేక్షకులు చాలామంది ఇతడిని మర్చిపోయారు! 'స్వయంభు' కాకుండా రామ్ చరణ్ నిర్మాతగా 'ద ఇండియన్ హౌస్' అని ఓ ప్రాజెక్ట్ అనౌన్స్ చేశారు. అది ఉందో లేదో? 'స్వయంభు' రిలీజ్‌తో పాటు తన సినిమాలపై క్లారిటీ ఇవ్వాల్సిన అవసరం నిఖిల్‌కి ఎంతైనా ఉంది!



ఈ ఏడాది హ్యాట్రిక్ హిట్స్.. 'సీన్' కలెక్షన్ ఎంత?

ఈ ఏడాది సూర్య నామసంవత్సరంగా సాగుతుంది. ఎందుకంటే వేసవిలో ఓ సినిమాతో, వర్షాకాలంలో మరో మూవీతో.. ఇప్పుడు చలికాలంలో మరో చిత్రంతో వచ్చి వరసగా హిట్స్ కొట్టాడు. మరి లేటెస్ట్‌గా వచ్చిన 'సీన్'కి ప్రేక్షకుల నుంచి ఎలాంటి రెస్పాన్స్ వస్తోంది? తొలిరోజు కలెక్షన్ ఎన్ని కోట్లు వచ్చాయ్? 'ఆవేశం' లాంటి క్రేజీ మూవీ తీసిన దర్శకుడు జీతూ మాధవన్.. హీరో సూర్యతో కలిసి చేసిన తమిళ మూవీ 'సీన్'. నజ్రియా హీరోయిన్ కాగా నస్లేన్ విలన్‌గా చేశాడు. ప్రమోషనల్ కంటెంట్‌తోనే బజ్ వచ్చేలా చేశారు. సినిమా కూడా అందుకు తగ్గట్లే అదిరిపోయింది. అటు తమిళం, ఇటు తెలుగు నుంచి పాజిటివ్ టాక్ వచ్చింది. కామెడీ క్రైమ్ థ్రిల్లర్ కథతో తెరకెక్కిన ఈ చిత్రం చాలామందిని అలరిస్తోంది. ఇకపోతే తొలిరోజు ఈ సినిమాకు రూ.19.15 కోట్ల నెట్ కలెక్షన్స్ వచ్చినట్లు తెలుస్తోంది. తమిళం నుంచి రూ.16.15 కోట్లు రాగా తెలుగు నుంచి రూ.3 కోట్ల మొత్తం రాబట్టినట్లు సమాచారం. ప్రస్తుతానికి టాక్ బాగుంది. దీపావళి సెలవులు కూడా కలిసొచ్చాయి కాబట్టి వీకెండ్ అయ్యేసరికి వసూళ్లు పెరిగే అవకాశముంది.

'సీన్' విషయానికొస్తే.. క్రైమ్ బ్రాంచ్‌లో డీఎస్పీగా పనిచేసే ప్రేమ్ రాజ్ (సూర్య) తన తెలివి తేటలతో క్లిష్టమైన కేసులను ఈజీగా సాల్వ్ చేస్తుంటాడు. సీరియల్ కిల్లర్ విక్టర్ (టోవినో థామస్)ను అరెస్ట్ చేసిన తర్వాత తన ఉద్యోగానికి రాజీనామా చేయాలని నిర్ణయించుకుంటాడు. అది పెండింగ్‌లో ఉండగానే నగరంలో వరుస హత్యలు జరుగుతుంటాయి. అవన్నీ సీరియల్ కిల్లర్ విక్టర్ చేసిన మర్డర్స్ మాదిరే ఉంటాయి. విక్టర్ జైల్లో ఉంటే బయట ఆ హత్యలు ఎవరు చేస్తున్నారనేది మిస్టరీగా మారుతుంది. అదే సమయంలో ప్రేమ్ సంబంధించిన ఓ సంచలన నిజం క్రైమ్ బ్రాంచ్ చీఫ్ స్టీఫెన్‌కి తెలుస్తుంది. దీంతో విక్టర్‌ని ఉద్యోగం నుంచి తప్పిస్తాడు. అయినప్పటికీ సీరియల్ కిల్లర్ కేసుని ప్రేమ్ సవాల్‌గా తీసుకుంటాడు. మాయ(నజ్రియా) సాయంతో ఈ కేసులను విచారిస్తుంటాడు. అసలు ఆ హత్యలు చేస్తున్నదెవరు? ప్రేమ్ ఆ సీరియల్ కిల్లర్‌ని ఎలా పట్టుకున్నాడు? పై అధికారుల దగ్గర ప్రేమ్ దాచిన నిజం ఏంటి? ప్రేమ్‌కు ఉన్న సమస్య ఏంటి? ఈ కేసు విచారణలో ప్రేమ్‌కి మాయ ఎలాంటి సహాయం చేసింది? ఈ కథలో ఈశ్వరన్ (నస్లేన్) పాత్ర ఏంటి అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.